www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 306 | పేజీలు : 9 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | మంగళవారం 16-07-2024

MHR TV

www. mhrtv.com

## మోదీ ఫాలోవర్లు 100 మిలియన్లు




- ఎక్స్‌లో సరికొత్త రికార్డు
- ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుల్లో టాప్ స్థానం
- యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లోనూ మోదీ హవా
- ఫాలో చేస్తున్న అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, వ్యాపార వేత్తలు, వివిధ వర్గాల ప్రముఖులు

6

## గౌడన్నలకు అవమానం




- గంటల తరబడి చెట్ల మీద ఉంచడం సరైంది కాదు
- కులవృత్తి మీద చౌకబారు జోకులు వేయడం దుర్మార్గం
- మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్‌లో ఉంటుంది
- 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ తీరుపై కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్ జూలై 15 (ప్రజాస్వరం):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడలో కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గౌడన్నల పట్ల సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గంటల తరబడి గౌడన్నలను చెట్ల మీద ఉంచడం సరికాదన్నారు. మానవత్వం ఉన్న నాయకుడెవరూ ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడడు అని నిప్పులు చెరిగారు కేటీఆర్. గౌడన్నలను ఆ చెట్ల మీద అంతంతసేపు నిలబెట్టి, వారి వృత్తి మీద చౌకబారు జోకులు వేస్తూ, దాన్ని ప్రచారానికి వాడుకోవడం అమానవీయం, దుర్మార్గం అని ధ్వజమెత్తారు. మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్ లో ఉంటుంది అని, మీ మతిలేని చర్యలు చూసి తెలంగాణ ప్రజలకు అర్థమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

**గౌడన్నలకు అధునాతన మోకులు.. బీఆర్ఎస్ హయాంలోనే రూపకల్పన**

తాటిచెట్టుపై నుంచి పడి ప్రతి

మిగతా 2 లో..



రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీకి లైన్ క్లియర్

- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్
- వివరాలు, సందేహాల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు
- డబ్బులునేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి..
- ఆరోహణ క్రమంలో విడుదల చేయ నున్న ప్రభుత్వం

2

## రేషన్ కార్డుంటేనే రుణమాఫీ

### పంట రుణమాఫీ పూర్తి మార్గదర్శకాలు విడుదల

పంటల రుణమాఫీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసింది. రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. పంట రుణమాఫీ పై ఎలాంటి సందేహాలు, వివరాలు కావాలన్నా ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రుణాలు మాఫీ కానున్నాయి. పంట రుణమాఫీ సొమ్ము నేరుగా లబ్ధిదారుల రుణ ఖాతాలకు జమకానున్నది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేయనున్నది.

– హైదరాబాద్ జూలై 15

విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999

## కారుదిగిన గూడెం

### సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

**పటాన్ చెరు, జూలై 15, (ప్రజాస్వరం) :** బీఆర్ఎస్ నేత, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో సోమవారం సాయంత్రం ఆయన హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మహిపాల్ రెడ్డితో పాటు జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి అనిల్ సైతం తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. మహిపాల్ రెడ్డి చేరికతో బీఆర్ఎస్ ను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య 10కి చేరింది.



కాంగ్రెస్ కండువా కప్పి గూడెం మహిపాల్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

## ముంచెత్తుతున్న వర్షం



- రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వానలు
- హైదరాబాద్‌లో రెండు రోజులుగా దంచికొడుతున్న వర్షం
- మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి సమీక్ష
- అప్రమత్తమైన డీఆర్ఎఫ్ బృందాలు
- అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటికి రావాలని జీహెచ్ఎంసీ హెచ్చరికలు

6




6

## వడివడిగా విశాఖ మెట్రో


- ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన
- మెట్రో నిర్మాణంపై అధికారులకు దిశా నిర్దేశం
- త్వరలో నెరవేరనున్న విశాఖవాసుల కల

## హై టెన్షన్..

### సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

- బీసీ జనసభ, నిరుద్యోగుల ఆందోళన
- డీఎస్సీ వాయిదా, బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్
- అడ్డుకున్న పోలీసులు.. పోలీస్ స్టేషన్ కు తరలింపు
- చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉద్యోగార్థుల అరెస్టు

2





సెక్రటేరియల్ వద్ద నిరుద్యోగులను అరెస్టు చేస్తున్న పోలీసులు ↑

← చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద పోలీసులు, నిరుద్యోగుల వాగ్వాదం

# రేషన్ కార్డుంటేనే రుణమాఫీ

- రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీకి లైన్ క్లియర్
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్
- వివరాలు, సందేహాల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు
- డబ్బులునేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి
- ఆరోహణ క్రమంలో విడుదల చేయనున్నప్రభుత్వం

హైదరాబాద్ జూలై 15 : పంటల రుణమాఫీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేశారు. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రుణాలు మాఫీ కానున్నాయి. పంట రుణమాఫీ సొమ్ము నేరుగా లబ్ధిదారుల రుణ ఖాతాలకు జమకానున్నది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేయనుంది.

**మార్గదర్శకాలు ఇవే..**

1. తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుంది.
2. ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుంది.
3. తెలంగాణలో రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు.. వాటి బ్రాంచ్ ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.
4. 12.12.2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేక రెన్యువల్ అయిన రుణాలకు, 09.12.2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.
5. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబం రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీకి అర్హులు. 09.12.2023 తేదీ నాటికి బకాయి ఉన్న అసలు, వర్తింపయ్యే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి ఉంటుంది.
6. రైతు కుటుంబం నిర్ణయించడానికి పౌర సరఫరాల శాఖ నిర్వహించే ఆహారభద్రత కార్డు(రేషన్ కార్డు) డేటాబేస్ ప్రామాణికంగా ఉంటుంది. కాబట్టి అట్టి కుటుంబంలో ఇంటి యజమాని జీవితభాగస్వామి పిల్లలు అందరూ ఉంటారు.
7. అర్హత గల రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల రైతు రుణఖాతాలకు జమ చేయబడుతుంది. పీఏసీఎస్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ లేదా బ్యాంకు బ్రాంచికి విడుదల చేస్తారు. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని పీఏసీఎస్ లో ఉన్న రైతు ఖాతాలో జమ చేస్తారు.
8. ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 తేదీ నాటికి ఉన్న రుణ మొత్తం ఆధారంగా ఆరోహణ క్రమంలో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయాలి.
9. ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 నాటికి కలిగి ఉన్న మొత్తం రుణం లేదా రూ. 2 లక్షల వరకు ఏది తక్కువ ఉంటే ఆ మొత్తాన్ని ఆ రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.
10. ఏ కుటుంబానికి అయితే రూ. 2 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు రూ. 2 లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత గల రూ. 2 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.
11. రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేయాలి. రుణమాఫీ అమలుకు ప్రతి బ్యాంక్‌కు ఒక నోడల్ అధికారిని నియమించి.. రైతు రుణ మాఫీ పేర్లను సెలక్ట్ చేయనున్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**వనమహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలి**
**ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి**



వనమహోత్సవంలో పాల్గొని మొక్క నాటిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల, జూలై 15 (ప్రజాస్వరం):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న వనమహోత్స కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కేంద్రంలో ఈద్గా దగ్గర ఐపీఎస్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. వన మహోత్సవానికి సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలకు అవసరమైన మొక్కలు అందించి ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలాలో నాటేలా చూడాలన్నారు. నాటిన వాటి సంరక్షణ గురించి తెలియజేయాలని ఆదేశించారు. పెరిగిన మొక్కలు నరికి వేయడం వలన ప్రకృతికి నష్టం జరుగుతుందని, పట్టణంలో చెట్లను నరికి వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. మొక్కలు నాటడడంతో ప్రకృతిని కాపాడినవారవుతారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ పచ్చదనం పెంపుతూనే మానవ మనుగడ సవ్యంగా సాగుతుందన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. మానవ మనుగడకు చెట్లను కాపాడుకోవడంతోపాటు విరివిరిగా మొక్కలు నాటడమే మన ముందున్న ప్రధాన కర్తవ్యం మన్నారు. రోజులలో చెట్లు పెంపకం అనేది చాలా ముఖ్యమని, వాతావరణం లో ఆక్సిజన్ తగ్గిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, ప్రస్తుత సమాజంలో విస్తరించిన గ్లోబలైజేషన్ మూలంగా పెద్ద ప్రమాదం ముంచుకొచ్చిందని, టెలికమ్యూనికేషన్ చాలా పెరిగిపోయి, రేడియేషన్ ఎంతో వాతావరణంలో ఇమిడిపోయిదని అన్నారు. ఈ రేడియేషన్ వాతావరణం లో మన కంటికి కనబడకుండా ఉండి ఆక్సిజన్ తగ్గించి మన అనారోగ్యాలకు కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. దీనికి నివారించాలంటే మొక్కలు నాటడమే సరైన ప్రత్యామ్నయ మార్గం అన్నారు... ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మీర్ ఖాజీమ్ అలీ, కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్స్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ దుర్గయ్య ,స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# హై టెన్షన్...

**సెక్రటేరియట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు**
**బీసీ జనసభ, నిరుద్యోగుల ఆందోళన**
**డీఎస్సీ వాయిదా, బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్**
**అడ్డుకున్న పోలీసులు.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు**
**చలో సచివాలయం చేపట్టిన ఏఐఎస్ఎఫ్ నాయకుల అరెస్టు**
**చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగుల ఆందోళన**

**హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం):** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయడం సహా, బీసీ కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో బీసీ జనసభ నాయకులు, నిరుద్యోగులు సచివాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాాలు చేస్తూ సచివాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా ఆందోళనకారులను అరెస్ట్ చేసి డీసీఎం వాహనంలో పోలీస్ స్టేషన్ కు తరలించారు.రాష్ట్రంలో బీ.సి కులగణన వెంటనే చేపట్టాలని.. స్థానిక సంస్థల్లో బీ.సీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ విద్యార్థి జేఏసీ నేత రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. 'ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 10 ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలి. గ్రూప్-1 మెయిన్స్ కు 1:100 నిష్పత్తి అమలు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, మూడు నెలలు డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్ 2, 3 పరీక్షల వాయిదా, పోస్టుల సంఖ్య పెంపు తదితర హామీలను నెరవేర్చాలి' అని సర్కారును డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.రాష్ట్రంలో డీఎస్సీ సహా ఇతర పోటీ పరీక్షలు వాయిదా వేయాలంటూ గత కొద్ది రోజులుగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నగరంలో భారీ వర్షంలోనూ నిరసన తెలిపారు. అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్ ప్రాంతాల్లోనూ నిరుద్యోగులు గత రెండు రోజులుగా ధర్నాలకు దిగారు. పరీక్షలు వాయిదా, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై ప్రభుత్వ తీరుకు నిరసనగా నిరుద్యోగులు సోమవారం సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సచివాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని భారీగా మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుప కంచెలు, వాటర్ క్యానన్లు ఏర్పాటు చేశారు. అటు, ఇతర ప్రాంతాల నుంచి సచివాలయం ముట్టడించేందుకు తరలివస్తోన్న విద్యార్థులను, నిరుద్యోగులను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. సెక్రటేరియట్ కు వెళ్లే అన్ని దారుల్లోనూ నిఘా పెంచారు. అటు, 'ఛలో సచివాలయం' కార్యక్రమానికి పిలుపునిచ్చిన ఏఐఎస్ఎఫ్ నాయకులను సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉపకార వేతనాలు, బోధన రుసుములు విడుదల చేయాలన్న డిమాండ్ తో జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి సచివాలయానికి ఏఐఎస్ఎఫ్ నాయకులు ర్యాలీ చేపట్టారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం స్పందించకుంటే బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించింది. కాగా, పరీక్షలు వాయిదా వేయాలన్న నిరుద్యోగుల ఆందోళనలపై సీఎం రేవంత్ సహా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. ప్రత్యేక తెలంగాణ సాధించిందే ఉద్యోగాల కోసమని.. ప్రతీసారి పరీక్షలు వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేశారు. ఇదే చివరి డీఎస్సీ కాదని.. త్వరలో 5 వేల నుంచి 6 వేల పోస్టులతో మరో డీఎస్సీ నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు.మరోవైపు సోమవారం రాత్రి గ్రూప్ 2,3 పోస్టుల సంఖ్యను పెంచి, పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని ఉద్యోగార్థులు నిరసన చేపట్టగా పోలీసులు లాఠీ చార్జి చేశారు.

**ఇంత పాశవికంగా ప్రవర్తిస్తారా.. మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం**

చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థుల పై పోలీసుల దౌర్జన్యాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వం ఇంత పాశవికంగా ప్రవర్తించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇదేనా ప్రజా పాలన అంటే, ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే? అని ప్రశ్నించారు. నాడు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్ గాంధీని తీసుకువెళ్లి ఓట్లు కొల్లగొట్టారని, నేడు అదే లైబ్రరీకి పోలీసులను పంపించి విద్యార్థుల వీపులు పగలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై జరుగుతున్న దమనకాండను ప్రభుత్వం వెంటనే ఆపాలని, ఈ ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



సెక్రటేరియట్ వద్ద ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**భవిష్యత్ తరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది**
**ఇంటికి ఆరు చొప్పున నాటాలి**
**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, జూలై 15 (ప్రజాస్వరం) :** శాతవాహన యూనివర్సిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. భవిష్యత్తు తరాన్ని కాపాడుకునేందుకు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన 75 వనమహోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వన మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నదని తెలిపారు. భవిష్యత్తు తరాన్ని కాపాడుకునేందుకు, పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఆరు మొక్కలు విధిగా నాటాలని, వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైన పూలు, పండ్ల మొక్కలను అధికారులు అందిస్తారని తెలిపారు. యూనివర్సిటీ నిర్మాణం సందర్భంగా ఇన్ని మొక్కలు కనిపించలేదని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో యూనివర్సిటీ శంకుస్థాపన జరిగిందని తెలిపారు. 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ కేటాయించడం జరిగిందన్నారు. అప్పుడు కేసిరెడ్డితో పాటు అధికారులను తీసుకొచ్చి స్థల సేకరణతో పాటు యూనివర్సిటీ నిర్మాణానికి కృషి చేశామని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో 43 లక్షల మొక్కల పెంపకానికి ప్రభుత్వం లక్ష్యం విధించిందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతి నిధులు, ప్రజలు అందరూ పెద్ద ఎత్తున మొక్క లు నాటాలని సూచించారు. ప్రతి మొక్కకు జియో టాకింగ్ చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే మొక్కలే నాటాలని, ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆక్సిజన్, నీడ, పండ్లు పూలు అందించే మొక్కలు నాటాలని సూచిం చారు. తల్లి పేరు మీద, కుటుంబ సభ్యుల పేరు మీద, ఇష్టం వచ్చినవారు పేర్ల మీద మొక్కలు నాటవచ్చని పేర్కొన్నారు. కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ వర ప్రసాద్, ఆర్డీఓ మహేశ్వర్, డీఆర్డి ఓ శ్రీధర్, డీఎఫ్ఓ బాలమణి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో ప్రభు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొ న్నారు.



మొక్క నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



# గల్ఫ్ సంక్షేమానికి నిధులు కేటాయించాలి

**మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు గల్ఫ్ జేఏసీ వినతి**

జగిత్యాల, జూలై 15, (ప్రజాస్వరం) : గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం ఈ బడ్జెట్ లో రూ.500 కోట్లు కేటాయించాలని గల్ఫ్ జేఏసీ బృందం సోమవారం హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. గల్ఫ్ తదితర దేశాలలోని వలస కార్మికుల సంక్షేమం కోసం 'గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (గల్ఫ్ బోర్డు) ఏర్పాటు చేయాలని, సమగ్ర ప్రవాస భారతీయుల విధానం (ఎన్నారై పాలసీ) ప్రవేశపెట్టాలని వారు కోరారు. రాష్ట్ర గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గల్ఫ్ సంఘాల నాయకులు దొనికెని క్రిష్ణ, మంద భీంరెడ్డి, గంగుల మురళీధర్ రెడ్డి, తోట ధర్మేందర్ తదితరులు గల్ఫ్ జేఏసీ బృందంలో ఉన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు గురించి స్పష్టమైన జీవో విడుదల చేయాలని, గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన వారి గురించి సమగ్ర సర్వే చేయించాలని, రేషన్ కార్డుల నుంచి ఓటర్ లిస్ట్ నుంచి గల్ఫ్ కార్మికుల పేర్లు తొలగించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

# గౌడన్నలకు అవమానం

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరం ఎంతోమంది కల్లుగీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో వాటి నివారణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సేఫ్టీ మోకులు రూపొందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బీసీ సంక్షేమశాఖకు బాధ్యతలు అప్పగించి దాదాపు రూ. 8 కోట్లు కేటాయించింది. బీసీ సంక్షేమశాఖ ఆ బాధ్యత ను ఓ ఏజెన్సీకి అప్పగించింది.ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఆ ఏజెన్సీ సేఫ్టీ మోకులను రూపొందించింది. అప్పుడే వాటిని పంపిణీ చేయాలని బీఆర్ ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. ఇప్పుడు 'కాటమయ్య రక్షణ కిట్లు' పేరిట కాం గ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నవి అవే. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికి అందించాలని ల క్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో సేఫ్టీమోకు రూ. 9 వేలపైనే ఉంటుందని అధికారులు తెలిపారు.

# నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ

- బాధితులనే బాధించే అవకాశం
- కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం
- నూతన చట్టాలు - సమాజంపై ప్రభావం
- సెమినార్‌లో సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి

**ఖమ్మం, జూలై 15 (ప్రజాస్వరం):** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. ఖమ్మం సీపీఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ గత చట్టాలు బ్రిటిష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పన పై దృష్టిసారించిన ప్రభుత్వం కులంకషంగా చర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని, కేవలం 43 గంటల 23 సెకన్లు మాత్రమే చర్చించారని తెలిపారు. పేరు బ్రిటిష్ చట్టాలదే అయినా చట్టాల మార్పు వెనక బీజేపీ మార్క్ దాగి ఉందని 10 శాతం గతంలో ఉన్న భారతీయ శిక్షాస్మృతిని మార్చి భారతీయ న్యాయ సంహితను తీసుకువచ్చారని ఇందులో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యతను ఇవ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని ఆయన తెలిపారు. ఏ తప్పుకు ఏ శిక్ష అన్నది భారతీయ శిక్షాస్మృతి ప్రకారమే తీసుకుని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా సంహిత చట్టాలను తీసుకు వచ్చారని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. పార్లమెంటులో విపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబరు 2023న పార్లమెంటులో 21 డిసెంబరు 2023న రాజ్యసభలో ఆమోదం పొంది 25 డిసెంబరు 2023న గెజిట్ గా మారిందని తెలిపారు. ఈ చట్టాల అమలు వల్ల దుష్పరిణామాలను పరిగణలోకి తీసుకోలేదని ఐపీసీలో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో 358కి కుదించారని ఆయన తెలిపారు. 124 ఏ సెక్షన్లో గతంలో ఉన్న రాజ ద్రోహం స్థానే దేశ ద్రోహం చట్టాన్ని తీసుకువచ్చారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 163వ సెక్షన్ సోషల్ మీడియాలో ఈ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినా, ప్రచారం నిర్వహించినా దేశ ద్రోహం కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కొన్నింటిలో పోలీసుల జోక్యాన్ని తగ్గించారని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి

కొన్ని చట్టాలను కఠినతరం చేశారని గతంలో సాధారణ శిక్షల స్థానే ఇప్పుడు జీవిత కాల ఖైదు, మరణ శిక్షను సైతం విధించేవిధంగా చట్టాలను రూపొందించారన్నారు. నూతన చట్టాలు ఒకటి జూలై 2024 నుంచి అమల్లోకి వచ్చిన గతంలో ఐపీసీ ప్రకారం నమోదైన కేసులను ఆ సెక్షన్ల ద్వారానే విచారిస్తారని పాత కేసులు పూర్తయ్యే వరకు కొత్త, పాత చట్టాలతో పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతంలో ఉన్న చట్టాలను ఇప్పుడు తీవ్రతరం చేశారని ఢీకొట్టి పారిపోవడం లాంటివి చేస్తే పదేళ్ల వరకు శిక్ష ఉండే అవకాశం ఉందని నాన్ బెయిలబుల్ కేసులు 102 (2) బీఎన్ఎస్ ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయవచ్చన్నారు. ప్రభుత్వాల పట్ల కానీ, ప్రజాప్రతినిధుల పట్ల కానీ దురుసుగా ప్రవర్తించడం, అడ్డుకోవడం లేదా బెదిరింపులకు పాల్పడడం ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం లాంటి వాటిని నేరాలుగా పరిగణించి ప్రస్తుత నూతన చట్టాలలో శిక్షను ఖరారు చేశారని ఆయన తెలిపారు. గతంలో హత్యాయత్నం కేసుకు సంబంధించి నేరం జరిగిన తీరును బట్టి జీవిత ఖైదు లేదా పదేళ్లు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అన్నింటికి మించి మోడీ, అమిత్ షాలను మాత్రమే సంప్రదించి ఈ చట్టాలను అమలు చేశారని ఇందులో న్యాయ నిపుణులను కానీ బార్ కౌన్సిల్ ను కానీ పరిగణలోకి తీసుకోలేదన్నారు. గతంలో ఓ కేసు నమోదైనప్పుడు అప్పుడు బాధ్యతల్లో ఉన్న అధికారి మాత్రమే కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆ స్థానంలో వచ్చిన అధికారులు ఎవరైనా సాక్ష్యం చెప్పే వెసులుబాటు కల్పించారని అన్నారు. ఈ సెమినార్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి. ఎర్రబాబు, ఎస్కే జానిమియా, కొండపర్తి గోవిందరావు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఏఎల్ నాయకులు పట్టాభి, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు శింగు నర్సింహారావు, ప్రముఖ న్యాయవాది ఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక





## ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు పంపిణీ..


**రామాయంపేట, జూలై 15 (ప్రజాస్వరం):** తెలంగాణ రాష్ట్ర వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం నార్సింగి మండలంలోని జప్తి శివునూర్, భీమ్రావు పల్లి, నార్సింగ్ లలో మొక్కలు నాటామని ఇంచార్జీ ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వర్ గౌడ్ తెలిపారు. మండలంలో 34 వేల ఐదు వందల మొక్కలను నాటాలని లక్ష్యంగా పేర్కొన్నారు, అందులో భాగంగా రెవెన్యూ ప్లాంటేషన్ ప్రారంభించడం జరిగిందని, జప్తి శివనూర్, భీమ్రావుపల్లి గ్రామాలలో ప్రతి ఇంటికి ఐదు పండ్లు, పూల మొక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మొక్కలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ మొక్కలులాంటి పలు రకాల మొక్కలు పంపిణీ చేయడానికి నర్సరీలలో మొక్కలు సిద్దంగా ఉన్నాయని అన్నారు. హరిత తెలంగాణ కోసం ప్రజలు తమవంతు కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలను నాటి వాటిని పరిరక్షించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఏపీవో టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వర్ గౌడ్, భీమ్రావుపల్లి కార్యదర్శి స్వాతి తదితరులు పాల్గొన్నారు.





## హెల్త్ అవేర్‌నెస్‌పై సర్క్యులర్..

**చేగుంట, జూలై 14 (ప్రజాస్వరం) :** లయన్స్ ఇంటర్నేషనల్ 320 డీ డిస్ట్రిక్ మొదటి క్యాబినెట్ మీటింగ్ హైదరాబాద్ లోని లయన్స్ భవనంలో లయన్స్ గవర్నర్ నగేష్ పంపటి అధ్యక్షతన నిర్వహించారు. డిస్ట్రిక్ క్యాబినెట్ లో 2024-2025 సంవత్సరానికి గాను చేగుంటకు చెందిన ఆకుల సుఖేందర్ హెల్త్ అవేర్నేస్ ఇంచార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. హెల్త్ అవేర్నేస్ పై కేబినెట్ సమావేశంలో సర్క్యులర్ గవర్నర్ చేతులమీదుగా విడుదల చేశారు. సమావేశంలో డిస్ట్రిక్ వైస్ గవర్నర్ అమర్నాథ్ , పాస్ట్ డిస్ట్రిక్ గవర్నలు లక్మి, సూర్యారాజు, నర్సింమారాజు, శ్రీధర్, మర్రి ప్రవీణ్, చేగుంట క్లబ్ డిస్ట్రిక్ చైర్ పర్సన్ ద్యావ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## శాంతియుతంగా మొహర్రం జరుపుకోవాలి

**రామాయంపేట, జూలై 15 (ప్రజాస్వరం) :** మొహర్రం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ మాణిక్ ప్రభు ఆధ్వర్యంలో శాంతి పరిరక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వ మత పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాణిక్ ప్రభు, మత పెద్దలు మాట్లాడుతూ.. మొహర్రం అన్ని మతాల వారు కలిసి జరుపుకునే పండుగ అన్నారు. నర్సింగ్ లో ఇప్పటి వరకు ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగలేదని, అన్ని మతాల వారి సహకారం వల్లనే ఇది సాధ్యపడిందన్నారు. ఈ ఏడాది కూడా పండుగ మత సామరస్యంగా కలిసి మెలసి శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100 నంబర్ కు గాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మాణిక్ ప్రభుతో పాటు, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేష్ గౌడ్, సిద్దా గౌడ్, స్వామి గౌడ్, ముర్తుజా, లాయఖ్ పాషా, ముజీబ్, ఏశబోయిన యాదగిరి యాదవ్, తలారి సత్తయ్య, హెడ్ కానిస్టేబుల్ పోచయ్య, బాలరాజు గౌడ్, రమేష్, ఆనంద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
**ఆర్టీసీ, విద్య, డీఆర్‌డీఓ, ఆరోగ్య, పంచాయతీ, వ్యవసాయ, పౌరసరఫర, అటవీశాఖ అధికారులతో సమీక్ష**
**శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం**

**మెదక్, జూలై 15 (ప్రజాస్వరం):** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆర్టీసీ, విద్య, డీఆర్‌డీఓ, ఆరోగ్య, పంచాయతీ, వ్యవసాయ, పౌరసరఫర, అటవీశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల పనితీరును శాఖల వారిగా అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... ఆర్టీసీలో ప్రయాణికుల సౌకర్యాలను, బస్సు డిపోల్లో పరిశుభ్రత కార్యక్రమాలను, ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఎంతమంది మహిళలకు లబ్ది చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. డీఆర్డీఓ అధికారులను మహిళలకు స్వయం సహాయక గ్రూపులకు అందించే సహాయ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. విద్యాశాఖపై మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల పున: ప్రారంభం తర్వాత విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజనం, పుస్తకాల పంపిణీ, ఏకరూప దస్తుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గ్రామస్థాయిలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు, తాగునీరు కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖను జిల్లాలో వ్యవసాయ స్థితిగతులు, వర్ష ప్రభావం, రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు, విద్యుత్తు ఇలాంటి వివరాలను తెలుసుకున్నారు. పౌర శాఖ అధికారులను రేషన్ బియ్యం, గ్యాస్ సరఫరాలపై ఆరా తీశారు. అటవీ శాఖ అధికారులతో జిల్లాలో నాటే మొక్కల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, విద్యా శాఖ అధి కారి రాధా కిషన్, వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మరావు, అటవీ అధికారి రవికుమార్, పంచాయతీ అధికారి యాదయ్య, ఆర్టీసీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..**

రెడ్డిపల్లి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. రెడ్డి పల్లి, గ్రామ వ్యవసాయ భూమి ఆర్ఆర్ఆర్ లో పోతుందని దాని వల్ల గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్ మార్చాలని, పరిహారం పెంచాలని గ్రామ రైతులు కలెక్టర్ రాహుల్ రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రెడ్డిపల్లి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. అలైన్మెంట్ మార్చడం వీలు కాదని అయినప్పటికీ ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకెళ్తానని, పరిహారం పెంపు విషయంలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులందరూ సమన్వయంతో ఉండాలన్నారు. పరిహారం పెంపు విషయంలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఆవుల రాజి రెడ్డి, ఆంజనేయులు గౌడ్, సత్యనారాయణ గౌడ్, మహేష్ గౌడ్, సత్యనారాయణ, నిరంజన్, నగేష్ గౌడ్, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి



**రామాయంపేట, జూలై 15 (ప్రజాస్వరం):** నార్సింగ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశానుసారం ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయనున్నామని తహసీల్దార్ షేక్ కరీం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజావాణి జరుగుతుందని తెలిపారు. మండల పరిధి గ్రామాల ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, మండలానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కార సౌలభ్యం కోసం మండల తహశీల్దార్ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారని, సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో నార్సింగ్ మండలం నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేవని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అనూష, ఆర్.ఐ నవీన్ రావు, ఏఈఓ దివ్య, జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

## అధికారులు జవాబుదారీగా పని చేయాలి

**అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు.. ప్రజావాణిలో 144 దరఖాస్తులు స్వీకరణ**



**మెదక్, జూలై 15 (ప్రజాస్వరం):** అధికారులు జవాబుదారీగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మెదక్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ప్రజావాణిలో ఏ ఏ శాఖ వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయో తెలుపాలని ఆదేశించారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులు ధరణి - 43, పెన్షన్స్ - 12, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు - 18 ఇతర దరఖాస్తులు -71 మొత్తం 144 దరఖాస్తులు వచ్చాయనీ అన్నారు. స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రజావాణిలో ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వన మహోత్సవం

**మాసాయిపేట, జూలై 15 (ప్రజాస్వరం) :** మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపునిచ్చారు. రాబోవు తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్వో జ్ఞానజ్యోతి ఆరే ధన్ సింగ్ హై స్కూల్ హెడ్మాస్టర్ ధర్మపురి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## జీవో నెంబర్ 10ని రద్దు చేయాలి

- **రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి**
- **సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బసవ రాజు**

**మెదక్, జులై 15 (ప్రజాస్వరం) :** అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ సమస్యల పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నా నిర్వహించారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్యదర్శికి మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బసవ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తమ సమస్యల పరిష్కారం కోసం 253 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు 24 రోజులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేశారని గుర్తు చేశారు. ఆ సందర్భంగా జేఏసీ రాష్ట్ర నాయకత్వంతో ఆర్థిక మంత్రి హరీష్ రావు, ఐసిడిఎస్ మంత్రి సత్యవతి చర్చలు జరిగాయన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్వాడీ టీచర్లకు 2 లక్షలు ఆయాలకు లక్ష రూపాయలు, ఆసరా పెన్షన్ చెల్లిస్తామని, 65 సంవత్సరాల లోపు ఎవరైనా అంగన్వాడీ టీచర్స్ వర్తింపచేస్తామని, తెలంగాణ రాష్ట్ర రెండవ పీఆర్సీ లో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐ ఆర్ అంగన్వాడీ టీచర్ సిలబస్ కు వర్తింప చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లోను మెయిన్ సెంటర్ లుగా చేస్తూ జీవో ఇస్తామని, సమ్మె కాలపు వేతనాలు చెల్లిస్తామని ప్రమాద బీమా రెండు లక్షలు ఇస్తామని, స్పష్టమైన హామీ ని ఇచ్చారన్నారు. మంత్రులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐసిడీఎస్ మంత్రి, అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు తయారు చేసింది తప్ప, మిగతా హామీలు అమలు చేయలేదన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్కు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం వచ్చి సమస్యలు పరిష్కారం చేయకపోగా, పైగా వ్యతిరేక విధానాలు వేగవంతంగా అమలు చేస్తుందన్నారు. దీంతో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి, నాయకులు కె. మల్లేశం, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా
జర్నలిజం రంగంలో
విశిష్ట సేవలందిస్తూ
అత్యంత ప్రజాదరణ
పొందిన ప్రజాస్వరం
తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు,
మండల రిపోర్టర్లు కావలెను.



సెల్ : 800 860 9999



# సమస్యలు పరిష్కరించాలి

- **ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి**
- **వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, జూలై 15 (ప్రజాస్వరం) :** ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రధానంగా విద్య, వైద్య, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, భూసర్వే తదితర అంశాలకు సంబంధించి 84 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అట్టి ఫిర్యాదులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు . ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి**

జిల్లాలో ఓ మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు వల్ల రోడ్డు కొట్టుకుపోవడం, ఉద్యాన పంటలు నష్టం, ప్రాణనష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వికారాబాద్ జిల్లాను ఆరంజ్ అలర్ట్ గా ప్రకటించారని ప్రజలు అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తమై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.







# ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి

- **అంగన్వాడీ టీచర్లు, ఆయాల ధర్నా**
- **సంఘీభావం తెలిపిన సీఐటీయూ నాయకులు**
- **ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్**

**వికారాబాద్, జూలై 15 (ప్రజాస్వరం):** వికారాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేల ఇండ్ల ఎదుట సోమవారం జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమంలో భాగంగా వారు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వికారాబాద్ లోని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇంటి ఎదుట వికారాబాద్ నియోజకవర్గ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. తాండూరు పట్టణంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఇంటి ఎదుట, అలాగే పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి ఇంటి ఎదుట అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. జిల్లాలో అంగన్వాడీ టీచర్లు , ఆయాలు పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించగా ఆయా ఎమ్మెల్యేలు మాత్రం స్థానికంగా లేకపోవడంతో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నిరాశ చెందారు. సీఐటీయూ నాయకులు అంగన్వాడీ సిబ్బందికి సంఘీభావం కలిపి ధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.





# ఎంపీ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

**తాండూరు, జూలై 15 (ప్రజాస్వరం) :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం యాలాల మండలం లోని తొప్పర్ల గడ్డ తాండాలో గత కొన్నేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్య చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి శ్రద్ధ చూపడంతో పరిష్కారమైంది. తండాలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి. గతంలో తాగునీటి సమస్యపై ప్రభుత్వం ప్రవేటు పొలంలో బోరు వేయించి తండావాసులకు నీరు అందించింది. అయినా కూడా తండా వాసులకు నీటి తిప్పలు తప్పలేదు. నిత్యం నీటి కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి నీరు తీసుకొని వచ్చేవారు. ఇటీవల నీటి ఇబ్బంది పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా లాభం లేకపోయింది. మిషన్ భగీరథ నీరు కూడా అందడం లేదు. దీంతో రెండు నెలల క్రితం జుంటుపల్లి ప్రాజెక్టును సందర్శించిన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ఆ ప్రాంతవాసులు తమ నీటి గోసను వివరించారు. దీంతో స్పందించిన ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి స్థానిక మాజీ ఎంపీపీ బాలేశ్వర గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఎంపీ ఇచ్చిన ఆదేశాలతో తండాలో నూతన బోరు వేశారు. సోమవారం బోరుకు మోటారు బిగించి, తండాకు సరఫరా చేసే భగీరథ పైప్లైన్ కు అనుసంధానం చేశారు. నీరు అందడంతో తాండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తమకు తాగునీరు సమస్య తీర్చిన కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర గుప్తా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు రమేష్ కుమార్, కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, తాం దూర్ పట్టణ బిజెపి అధ్యక్షులు మల్లేశం, యాలాల మండల బిజెపి పార్టీ అధ్యక్షులు యాదగిరి, గ్రామ సర్పంచ్ లలితా బాయి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్వీ నాయకుడి ముందస్తు అరెస్టు



**రామయంపేట, జూలై 15 (ప్రజాస్వరం) :** నిరుద్యోగ సమస్యల కోసం పోరాటం చేస్తే అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని బీఆర్ఎస్వీ నాయకుడు రంజిత్ గౌడ్ అన్నారు. సచివాలయం ముట్టడికి బీఆర్ఎస్వీ రాష్ట్ర శాఖ పిలుపునివ్వడంతో మండల కేంద్రంలోని విద్యార్థి నాయకున్ని ముందస్తుగా సోమవారం నిజాంపేట పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం రంజిత్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగుల పట్ల కపట ప్రేమ చూపిస్తూ కాలయాపన చేస్తుందని వెంటనే వారి సమస్యలను పరిష్కరించేదాకా ఉద్యమం ఆగదని హెచ్చరించారు.



# మెదడు వాపు నివారణకు టీకా

**కార్యక్రమం నిర్వహణకు వైద్యులకు శిక్షణ**

వికారాబాద్, జూలై 15 (ప్రజాస్వరం): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ అధ్యక్షతన సోమవారం జిల్లాలోని 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి మెదడు వాపు వ్యాధి నివారణకు ఇచ్చే జేఈ టీకా శిక్షణ కార్యక్రమం జరిగింది. జేఈ వాక్సినేషన్ కార్యక్రమం రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నారు. కార్యక్రమంలో 6 నుండి 15 సంవత్సరాల వయసులోపు పిల్లలకు పాఠశాలల్లో జేఈ టీకా వేస్తారు. 9 నెలల నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ సెంటర్లలో వేస్తారు. ఈ శిక్షణ అనంతరం పీహెచ్ సి ల వైద్యులు పారామెడికల్ సిబ్బంది వారి పరిధిలో ఉన్న 15 సంవత్సరాలలోపు పిల్లల సంఖ్యను నిర్ధారించుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈనెల 25న జిల్లాలో ప్రారంభించబడుతుంది. డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మురారి, జేఈ వ్యాక్సినేషన్ యొక్క ప్రాముఖ్యత చేసుకోవలసిన ఏర్పాట్ల గురించి సిబ్బందికి శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, 22 పిహెచ్సి ల పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**లక్ష రూపాయల ఫిక్స్ డిపాజిట్ పత్రం అందజేసిన మైనంపల్లి వాణి**

**రామాయంపేట, జూలై 15 (ప్రజాస్వరం):** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వస్తూ ప్రమాదవశాత్తు మరణించిన మహిళ కుటుంబానికి మైనంపల్లి వాణి ఆర్థికసాయం అందజేశారు. లక్ష రూపాయల ఫిక్స్ డిపాజిట్ పత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన బాజ లావణ్య (30) తన స్కూటీ పై అసెంబ్లీ ఎన్నికలకు ఓటును వెయ్యడానికి వస్తున్న క్రమంలో తూప్రాన్ టోల్ ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని మృతి చెందింది. మృతి చెందిన మహిళకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నందున వారి భవిష్యత్తు కోసం సోమవారం మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా లక్ష రూపాయల డిపాజిట్ పత్రాన్ని అందజేశారు. అనంతరం మైనంపల్లి వాణి మాట్లాడుతూ లావణ్య కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మృతురాలి భర్త గణేష్ తదితరులు ఉన్నారు.



# రైతు రుణమాఫీ హర్షణీయం

- **రైతులతో కలిసి సంబురాలు జరుపుకున్న కాంగ్రెస్ నాయకులు**

**వికారాబాద్, జూలై 15 (ప్రజాస్వరం):** తెలంగాణలోని తెల్ల రేషన్ కార్డు ఉండి అర్హత ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర్వులను జారీ చేయడంతో వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు రైతులతో కలిసి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ రియాజ్, వికారాబాద్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, కార్యదర్శి మీనాజ్, యువజన కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, గోపాల్, ఏఎంసీ డైరెక్టర్ ఇక్బాల్, గ్రామ కమిటీ అధ్యక్షులు డీవై నర్సింలు, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఫయాజ్, మల్లేశం, అరవింద్, నాయకులు మల్లప్ప, షబ్బీర్, నయీం, ఎర్ర రవీందర్, సమేల్, కుమ్మరి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



# జోరువాన



**వికారాబాద్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం**

- **సాగునీటి చెరువులు, కుంటల్లోకి చేరుతున్న వరద నీరు**
- **అన్నదాతల్లో హర్షాతిరేకం**

**వికారాబాద్, జూలై 15 (ప్రజాస్వరం):** వికారాబాద్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎతతెరిపి లేకుండా వర్షం కురిసింది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, కోడంగల్, పరిగి నియోజకవర్గాల పరిధిలో రెండు రోజులు సగటున 50 నుంచి 150 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదయింది. జిల్లాలోని నవాబుపేట మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో అత్యధికంగా 91.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా జిల్లావ్యాప్తంగా సగటున 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. రెండు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణశాఖ వికారాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలకు జిల్లాలోని కొన్ని సాగునీటి చెరువుల్లోకి భారీగా నీరు చేరే అవకాశం ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు కుంటల్లోకి 50 నుంచి 70 శాతం వరకు వరద నీరు వచ్చి చేరుతోంది. అయితే జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు కోటిపల్లి ప్రాజెక్టులో 17 అడుగులు మాత్రమే వరద నీరు చేరింది. మరో ఏడు అడుగులకు పైగా నీరు చేరితే ప్రాజెక్ట్ నిండి అలుగు పారుతుంది. అయితే ప్రస్తుత వర్షాలు మెట్టపైర్లకు మేలు చేశాయని చెప్పవచ్చు. జిల్లాలో వరి సాగు చేసే రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు వరి పంటను సాగు చేస్తారు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు కురుస్తున్న భారీ వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల వల్ల కొన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాలకు ఇంకా మట్టి రోడ్లు మాత్రమే ఉండడంతో వర్షాల వల్ల మట్టి రోడ్లు పాడైపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## మరో ఐదు రోజులు భారీ వర్షాలు

**రంగారెడ్డి, జూలై 15 (ప్రజాస్వరం) :** తెలంగాణలో రాగల ఐదురోజుల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ఖమ్మం, జనగాం, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999

# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం, 15 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM


## సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి



నిజామాబాద్, జూలై 15 (ప్రజాస్వరం) : కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా ఒత్తిడి తేవాలని జిల్లాలోని అంగన్ వాడీలు నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ అంగన్ వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఖైరి దేవగంగు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రెండు లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, పెన్షన్స్ సౌకర్యం, వారసత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి, యమున, సరూప, వసంత, గంగ, లక్ష్మీ, ప్రమీల జయంతి, భాగ్యలక్ష్మి, మంజుల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### రాబోయే 48 గంటలు

# రెయిన్ అలర్ట్

## పలు జిల్లాలకు భారీ వర్ష సూచన



హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం): రాష్ట్ర వ్యాప్తంగా ముసురు ముంచేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరంతో పాటు పలు శివారు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాత నమోదైంది. ఈ క్రమంలో మరోసారి ఐఎండీ కీలక సూచనలే చేశారు. పలు జిల్లాల్లో మోస్తారు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, కొమురం భీం, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశ ఉంది. ఎడితెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ అధికారులు సూచిస్తున్నారు.

### దంచికొట్టిన వర్షం

ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వర్షం దంచికొట్టింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కాగా రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లా నీల్వాయిలో 15.83 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా కాటారంలో 11.15 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా కుంచవెల్లిలో 11.08 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్‌లో 11 సెం.మీ, భూపాలపల్లి జిల్లా కొయ్యూరులో 10.65 సెం.మీ, మంచిర్యాల జిల్లా కోటపల్లిలో 9.48 సెం.మీ, హైదరాబాద్ యూసఫ్ గూడలో 9.48 సెం.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా నవాబ్ పేటలో 8.48 సెం.మీ. వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ షేక్ పేటలో 8.45 సెం.మీ, మారేడ్ పల్లిలో 8.4 సెం.మీ, ఖైరతాబాద్‌లో 8.4 సెం.మీ, ముషీరాబాద్‌లో 8.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ శేరిలింగంపల్లిలో 7.93 సెం.మీ, హన్మకొండ దామెరలో 7.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లా మొగ్దం పల్లిలో 7.43 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

### నిండుకుండలా హుస్సేన్‌సాగర్

భారీ వర్షాలకు హుస్సేన్ సాగర్ లో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. హుస్సేన్ సాగర్ గరిష్ఠ నీటిమట్టం 514.75 మీటర్లు కాగా... ప్రస్తుతం 513.41 మీటర్లకు చేరుకుంది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, శానిటేషన్ సిబ్బందిని హుటాహుటిన రంగంలోకి దించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### హైవే 44పై ఘోర రోడ్డు ప్రమాదం

మహబూబ్‌నగర్, జూలై 15 (ప్రజాస్వరం): మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం భూరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారి 44పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. డీసీఎంను ఢీకొని ధర్మవరం డిపోకు చెందిన బస్సు దగ్ధమైంది. డీసీఎం డీజిల్ ట్యాంక్ పేలడంతో నిప్పు అంటుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులున్నారు. వెంటనే బస్సు నుంచి ప్రయాణికులు దిగిపోయారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. 15 మంది ప్రయాణికులకు మాత్రం స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. బస్ హైదరాబాద్ నుంచి ధర్మవరానికి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది.

### భార్యను దూరం చేసిందని
## అత్తను చంపిన అల్లుడు

మంచిర్యాల, జూలై 15 (ప్రజాస్వరం): మంచిర్యాల చున్నం బట్టివాడకు చెందిన నెల్లి విజయ కూతురు మాళవికను.. మంచిర్యాల పట్టణానికి చెందిన సాత్రం వెంకటేశ్‌కు ఇచ్చి ఐదేళ్ల క్రితం పెళ్లి చేశారు. కాపురంలో గొడవలు రావడంతో విషయం విడాకుల వరకు వెళ్లింది. దీనికి అత్త విజయనే కారణమని వెంకటేశ్ కోపం పెంచకున్నాడు. ఆదివారం రాత్రి పూటుగా తాగి వచ్చి అత్తపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన విజయ అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం వెంకటేశ్ కూడా అక్కడే గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కవచం' కిట్లను పంపిణీని చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

# మహేశ్వరం.. మరో మహానగరం..

## న్యూయార్క్ తో పోటీపడేలా అభివృద్ధి

### ప్రణాళికలు రూపొందిస్తున్నాం

### లష్కర్‌గూడ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కవచం' పంపిణీ

హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం): న్యూయార్క్‌తో పోటీపడేలా రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్‌ను నగరంగా అభివృద్ధి చేసినట్టే మహేశ్వరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో ఆదివారం గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కవచం' రక్షణ కిట్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. కవచం ధరించి చెట్లెక్కిన గీత కార్మికులతో ఆయన నేరుగా మాట్లాడారు. గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కాటమయ్యకు పూజలు చేసిన అనంతరం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ నిర్మాణంతో రంగారెడ్డి జిల్లాలో భూముల విలువ పెరిగిందని అన్నారు. త్వరలోనే హయత్‌నగర్ వరకు మెట్రో రైలును విస్తరిస్తామని, హయత్‌నగర్‌లో మెట్రో ఎక్కితే ఎయిర్‌పోర్టుకు చేరుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

### రూ.7.90 కోట్లు విడుదల

ప్రభుత్వం గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ.7.90 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేస్తామని ప్రకటించారు. తాటిచెట్ల పైనుంచి గీత కార్మికులు కిందపడి ప్రాణాలు కోల్పోకుండా.. వారి రక్షణ కోసం రూపుదిద్దుకున్న 'కాటమయ్య రక్షణ కవచం'.. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మాలోతు పూర్ణ ఆలోచన అని, ఈ కవచాన్ని రూపొందించిన బృందానికి అభినందనలు తెలిపారు. సభకు ముందు గీత కార్మికులతో సీఎం మాట్లాడారు. రోజుకు 15 చెట్లు గీస్తే 45 లీటర్ల కల్లు వస్తుందని ఓ కార్మికుడు చెప్పగా.. నీళ్లు ఏమైనా కలుపుతున్నారా అంటూ చమత్కరించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో కొందరు మహిళలు సమస్యలపై నినాదాలు చేయగా 'మీ వద్దకే ఎమ్మెల్యే, ఎంపీని పంపుతాన'ని ఆయన పేర్కొనడంతో వారి వద్దకు ప్రజాప్రతినిధులు వెళ్లారు.



### రాచకొండలో ఫిల్మ్ సిటీ

తెలంగాణకు వడ్డాణంలా 350 కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించడంతోపాటు రేడియల్ రహదారులను అభివృద్ధి చేస్తాం. 25వేల ఎకరాల్లో కాలుష్య రహిత పరిశ్రమలు, మెడికల్ హబ్, విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రణాళికలు తయారు చేస్తున్నారని చెప్పారు. ఊటీని తలపించేలా ఉండే రాచకొండను ప్రాంతం సినీ పరిశ్రమకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రాచకొండలో అభివృద్ధి చేయబోయే ఫిల్మ్‌సిటీలో ముంబయి తదితర ప్రాంతాల సినీ పరిశ్రమ తరలివచ్చేలా చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా గత ప్రభుత్వం చేసిన అప్పులే కనిపిస్తున్నాయి. ఏడాదికి రూ.72 వేల కోట్లు వడ్డీలే చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. పరీక్షల వాయిదాపై విజ్ఞప్తులు వినేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్ధంగా ఉన్నారు. రోడ్డెక్కె అవసరం లేకుండా సమస్యను పరిష్కరించే బాధ్యత మా ప్రభుత్వానిదే అని రేవంత్‌రెడ్డి అన్నారు.

కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, యెగ్గె మల్లేశం, ఏవీఎన్ రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీగౌడ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



### యాద'గిరి' ప్రదక్షిణ

భువనగిరి, జూలై 15 (ప్రజాస్వరం): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో చేపట్టిన గిరిప్రదక్షిణకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గత నెల తొలిసారి చేపట్టిన గిరిప్రదక్షిణపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో సోమవారం భారీగా భక్తులు తరలివచ్చారు. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్లు కొనసాగే ఈ ప్రదక్షిణ ఉదయం 6.05 గంటలకు వైకుంఠ ద్వారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ పాల్గొన్నారు.

## సెక్రటేరియట్ వద్ద హైటెన్షన్

### భారీగా మోహరించిన పోలీసులు

హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం): డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని ఈరోజు హైదరాబాద్ లోని సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునివ్వడంతో సెక్రటేరియట్ వద్ద భారీ సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల డీఎస్సీ వాయిదా కోరుతూ నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనతో పోలీసులు కంగుతింటున్నారు. ఎప్పుడు, ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చి రోడ్లపై బైఠాయిస్తారోననే ఆందోళన పోలీసుల్లో



నెలకొంది. ఈ నేపథ్యంలోనే అశోక్ నగర్ ప్రాంతాన్ని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రతి వీధి, గల్లీలో పహారా కాస్తున్నారు. పోలీసులు చేస్తున్న హడావుడితో స్థానికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### రాజారాం యాదవ్ అరెస్టు

సెక్రటేరియట్ ను ముట్టడించిన బీ.సీ జనసభ అధ్యక్షుడు, ఓయూ విద్యార్థి జేఏసీ నాయకుడు రాజారాం యాదవ్ ను పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీ.సి కులగణన వెంటనే చేపట్టాలి, స్థానిక సంస్థల్లో బీ.సీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేసిన బీ.సీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్.



# హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తుతున్న వర్షం





**లోతట్టు ప్రాంతాలు జలమయం..**

**హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం) :**

నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. చింతల్, సుచిత్ర, బాలానగర్, ఐడీపీఎల్, జీడిమెట్ల, సికింద్రాబాద్, బేగంపేట్ బోయిన్పల్లి, ప్యారడైజ్, చిలకలగూడ, ప్యాట్నీ, మారేడుపల్లి, అడ్డగుట్ట సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ సరఫరా సైతం నిలిపివేశారు. హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. చింతల్, సుచిత్ర, బాలానగర్, ఐడీపీఎల్, జీడిమెట్ల, సికింద్రాబాద్, బేగంపేట్ బోయిన్పల్లి, ప్యారడైజ్, చిలకలగూడ, ప్యాట్నీ, మారేడుపల్లి, అడ్డగుట్ట సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ సరఫరా సైతం నిలిపివేశారు.

**వర్షాలపై మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి సమీక్ష...**

హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జోనల్ కమిషనర్లు, ఈవీడీఎం టీమ్‌లతో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాళాల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని వారిని ఆదేశించారు. ఈదురు గాలులకు చెట్లు విరిగే ప్రమాదం ఉన్నందున ఈవీడీఎం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. భారీ వర్షం పడుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితేనే ప్రజలు బయటకు రావాలని ఆమ్రపాలి కోరారు. డీఆర్ఎఫ్ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనవసరంగా ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని జీహెచ్ఎంసీ సిబ్బంది ప్రజలకి హెచ్చరికలు జారీ చేశారు.

## మెట్రో ప్రాజెక్టులో కదలికలు

**విశాఖపట్టణం, జూలై 15 (ప్రజాస్వరం) :**

విశాఖవాసులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శుభవార్త అందించింది. ఇటీవల విశాఖలో పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులో కొంత కదలిక వచ్చింది. విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నడుం బిగించింది. ఈ క్రమంలోనే విశాఖ పర్యటనలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి గతంలో నిర్ణయించిన డిజైన్లకు అధికారులు కొన్ని మార్పులు చేయనున్నారు. విశాఖలో ఎన్‌హెచ్ఏఐ నిర్మించే ఫ్లై ఓవర్ బ్రిడ్జిల ఆధారంగా మెట్రో డిజైన్లు ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్ఏఐతో సమన్వయం చేసుకును ముందుకు వెళ్లేందుకు వీలుగా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి సీఎం చంద్రబాబు పర్యటన అనంతరం కదలిక వచ్చింది. మెట్రో రైలుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక –డీపీఆర్‌లోనూ కొన్ని మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మెట్రో పనుల్ని ముందుకు తీసుకువెళ్లాలన్న తన ఆలోచనలను ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ ఎండీ యూజేఎం రావుకు తెలిపారు.ఇక నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు పలుచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వాటిని నిర్మించిన తర్వాత మెట్రో నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తవచ్చన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్‌హెచ్ఏఐకి, మెట్రో రైలుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం విశాఖలో 12 ఫ్లై ఓవర్లు నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ డీపీఆర్ సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలోనే కొన్ని ప్రాంతాల్లో పిల్లర్ల చుట్టుకొలత పెంచడం, కొన్ని అదనంగా నిర్మించడం, వంతెనల పొడవు, వెడల్పుల్లోనూ కొన్ని మార్పులు చేయనున్నారు. అయితే అధికారుల సమావేశం తర్వాత త్వరలోనే వాటిపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.2017 లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించింది. 2018 లోనే అర్హత కలిగిన 5 సంస్థలు మెట్రో రైలు నిర్మాణానికి ఆసక్తి చూపాయి. ఎస్సెల్ ఇన్‌ఫ్రా కన్సార్టియం ఫైనాన్షియల్ అనే సంస్థ బిడ్ దాఖలు చేయగా.. ప్రాజెక్టు పట్టాలెక్కే సమయానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు రావడం.. అప్పుడు చంద్రబాబు ఓడిపోవడంతో అది అక్కడే ఆగిపోయింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. అంతకుముందు పిలిచిన టెండర్లతో పాటు డీపీఆర్‌ను రద్దు చేసి మళ్లీ కొత్తగా మొదలు పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 46 కిలోమీటర్లతో మొదట దశ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిచేయాలని నిర్ణయించగా.. తర్వాత వైసీపీ సర్కార్ దాన్ని అనకాపల్లి నుంచి భోగాపురం వరకు 140.13 కిలోమీటర్లకు పెంచింది.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేసీఆర్..ఎందుకంటే.?

**హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం) :**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలని గతంలో కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌నుతెలంగాణ హైకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. రేపు సీజేఐ చంద్రచూడ్ ధర్మాసనం ముందు కేసు విచారణ జరగనున్నది. కాగా. తెలంగాణలో జరిగిన విద్యుత్తు ఒప్పందాలపై జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్ నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌కు రెండోసార్లు నోటీసులు పంపించింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో కేసీఆర్ పాత్రపై కమిషన్ వివరణ కోరింది. తనను విచారణకు పిలవకూడదంటూ కేసీఆర్ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. అయితే గులాబీ బాస్‌కు న్యాయస్థానంలో చుక్కెదురైంది. కేసీఆర్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

## మరో రెండు రోజులు వానలే... వానలు

**హైదరాబాద్, జూలై 15 (ప్రజాస్వరం) :**

నైరుతి రుతుపవనాల కారణంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. నేటి నుంచి ఐదు రోజుల పాటు తెలుగురాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు బలపడటానికి తోడు.. అల్ప పీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ వర్షాలు ఈ రోజు నుంచి ఐదు రోజుల పాటు అంటే జులై 18 వరకు ఈ వర్షాలు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని కొన్ని జిల్లాలకు వర్ష సూచన చేసింది.ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలకు తోడు ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం చెప్పింది. ఏపీకి భారీ వర్షసూచన చేసింది వాతావరణశాఖ. రాష్ట్రంలో అల్లూరి సీతరామరాజు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను అమరావతి వాతావరణ శాఖ జారీ చేసింది. ఇక ఏపీలో మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. అలాగే, రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 30–40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ, నైరుతి దిశల నుండి ఎక్కువ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణశాఖ చెప్పింది. రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

## 100 మిలియన్ల మోడీ

**న్యూఢిల్లీ, జూలై 15 (ప్రజాస్వరం) :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్రేజ్ నానాటికీ పెరుగుతోంది.. అటు రాజకీయాలైనా.. ఇటు సోషల్ మీడియా అయినా.. తగ్గేదేలే అంటూ మోదీ దూసుకెళ్తున్నారు. ఇప్పటికే.. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టాప్ లో ఉన్నారు. ఏ దేశాధినేతకు లేనంత క్రేజ్.. భారత ప్రధానమంత్రికి నానాటికి పెరుగుతుండటం అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ.. అనతికాలంలోనే సోషల్ మీడియాలో మరో రికార్డును సృష్టించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ లో నరేంద్రమోదీ ఫాలోవర్ల సంఖ్య 100 మిలియన్లు దాటింది.. 100 మిలియన్లకు పైగా ఫాలోవర్లతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో అత్యధికంగా అనుసరించే ప్రపంచ నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ మరో మైలురాయిని నెలకొల్పారు. పీఎం మోడీ %శ% హ్యాండిల్ గత మూడు సంవత్సరాలలో సుమారు 30 మిలియన్ల వినియోగదారులు ఫాలో అవుతున్నారు.. మొత్తం మీద 100 మిలియన్ల మార్క్ దాటడం.. మామూలు విషయం కాదు..వివిధ భారతీయ రాజకీయ నాయకుల సోషల్ మీడియా ఫాలోయింగ్‌లను పోల్చినప్పుడు.. సోషల్ మీడియా ఫాలోవర్ల పరంగా %ూవీ% మోడీ ప్రత్యేకంగా నిలుస్తారు. రాహుల్ గాంధీకి 26.4 మిలియన్లు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు 27.5 మిలియన్లు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌కు 19.9 మిలియన్లు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి 7.4 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆర్జేడీకి చెందిన లాలూ ప్రసాద్ యాదవ్‌కు 6.3 మిలియన్లు, తేజస్వి యాదవ్‌కు 5.2 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండగా, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు 2.9 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.ప్రస్తుతం 38.1 మిలియన్ల మంది అనుచరులను కలిగి ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, ప్రస్తుత దుబాయ్ పాలకుడు హెచ్‌హెచ్ షేక్ మహ్మద్ (11.2 మిలియన్లు), పోప్ ఫ్రాన్సిస్ (18.5 మిలియన్లు) వంటి ప్రపంచ నాయకుల కంటే ప్రధాని మోదీ చాలా ముందున్నారు.%శ%లో ప్రధాని మోడీకి ఉన్న ప్రజాదరణను చూసి, ప్రపంచ నాయకులు %ూవీ% మోడీతో సోషల్ మీడియాలో అనుసరించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే మోదీతో కనెక్ట్ అవ్వడం వలన.. వారి ఫాలోవర్ల సంఖ్య, వీక్షణలు, రీపోస్ట్‌లు గణనీయంగా పెరుగుతాయి. ఇటీవల ఇటలీతో పాటు ఆస్ట్రియాలో కూడా ఇదే కనిపించింది.విరాట్ కోహ్లి (64.1 మిలియన్లు), బ్రెజిలియన్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు నేమార్ జూనియర్ (63.6 మిలియన్లు), అమెరికన్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ లెబ్రాన్ జేమ్స్ (52.9 మిలియన్లు) ఫాలోవర్స్ వంటి యాక్టివ్ గ్లోబల్ అథ్లెట్లతో పోల్చినప్పుడు ప్రధాని మోదీకి ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు. టేలర్ స్విఫ్ట్ (95.3 మిలియన్లు), లేడీ గాగా (83.1 మిలియన్లు), కిమ్ కర్దాషియాన్ (75.2 మిలియన్లు) వంటి ప్రముఖుల కంటే కూడా మోదీ ముందున్నారు.ఆసక్తికరంగా, గత మూడు సంవత్సరాలలో, %ూవీ% మోడీ %శ% హ్యాండిల్ సుమారు 30 మిలియన్ల మంది వినియోగదారుల అద్భుతమైన వృద్ధిని సాధించింది. అతని ప్రభావం యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లకు కూడా విస్తరించింది.. ఇక్కడ మోదీ వరుసగా 25 మిలియన్లు, 91 మిలియన్ల మంది అనుచరులు ఉన్నారు.2009లో ప్లాట్‌ఫారమ్‌లో చేరినప్పటి నుంచి %ూవీ% మోడీ నిర్మాణాత్మక పోస్టులను స్థిరంగా పోస్ట్ చేస్తున్నారు. ఆయన చురుకైన, ఆకర్షణీయమైన పోస్టులను పోస్ట్ చేస్తారు.. ఇంకా అనేక మంది సాధారణ పౌరులను సైతం అనుసరిస్తారు. వారితో సంభాషణలు (పోస్ట్‌లు %–% రీపోస్ట్‌లు) చేస్తారు.. వారి సందేశాలకు స్పందించి రీపోస్ట్ చేస్తారు.. ఇంకా ఎవరినీ ఎప్పుడూ బ్లాక్ చేయలేదు. పెయిడ్ ప్రమోషన్‌లు లేదా బాట్‌లను ఆశ్రయించకుండా ప్రధాని మోడీ ఎల్లప్పుడూ ఈ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగిస్తున్నారు.%శ% లో తెలివైన, ఆకర్షణీయమైన పోస్ట్‌ల మిశ్రమంతో ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ఆకర్షించారు. డిజిటల్ రంగంలో అతని పెరుగుదల అతని ప్రభావవంతమైన ఉనికిని ఈ రికార్డు నొక్కి చెబుతుంది. విభిన్న, చైతన్యవంతమైన ఫాలోవర్లతో ప్రధాని మోదీ అనుసరించే విధానం.. ఆయన ఖ్యాతిని మరింత ప్రతిబింబించేలా చేస్తోంది.

### ట్రంప్ పై కాల్పుల ఘటనను పట్టించుకోని టైమ్ స్క్వేర్..

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై తుపాకీ కాల్పుల దాడి ఘటన ప్రపంచ వ్యాప్తంగా కలకలం రేపుతున్నది. రిపబ్లికన్ పార్టీ తరపున మరోసారి ప్రెసిడెంట్ రేస్ లో ఉన్న ఆయన ఇవాళ పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఆయనపై ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో బుల్లెట్ ట్రంప్ చెవిని గాయపరుస్తూ దూసుకుపోయింది. తృటిలో ప్రణాపాయం నుంచి ట్రంప్ తప్పించుకోగలిగారు. ఈ కాల్పులకు సంబంధించిన వార్త క్షణాల్లో ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ లో మాత్రం ఈ వార్త ప్రసారం కాలేదట. ట్రంప్ పై కాల్పులు జరిగితే టైమ్ స్క్వేర్ లో ఈ కాల్పులకు సంబంధించి సింగిల్ వీడియో ప్రసారం చేయలేదని అమెరికా ఫ్రంట్‌లైన్ డాక్టర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. సిమోన్ గోల్డ్ సంచలన ట్వీట్ చేశారు. ట్రంప్ పై దాడి జరిగినప్పుడు నేను టైమ్స్ స్క్వేర్ మధ్యలో ఉన్నాను. ట్రంప్‌పై కాల్పులు జరిగినట్లు ఒక్క వీడియో కూడా మానిటర్ లలో ప్రదర్శించబడలేదు.సెన్సార్‌షిప్, ప్రచారం లోతు తనను ఆశ్చర్యపరుస్తుంది అని పోస్టులో రాసుకొచ్చారు. అయితే ట్రంప్ పై దాడి ఘటనను ప్రపంచ దేశాదినేతలు స్పందిస్తుంటే ప్రముఖమైన టైమ్ స్క్వేర్ పట్టించుకోలేదంటూ సిమోన్ గోల్డ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఈ పోస్టుపై నెటిజన్లు స్పందిస్తూ చాలా మంది అమెరికన్లు తమ మీడియా చైనా, ఉత్తర కొరియా మొదలైన వాటి కంటే భిన్నంగా లేదని గ్రహించలేకపోయారని కామెంట్ చేస్తున్నారు.

## ప్రజా పాలనలో మహిళలకు ఇదేనా గౌరవం..?

**ప్రొటోకాల్?పాటించడంలో అధికారులు విఫలం**
**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం**
**బోనాల పండుగ చెక్కుల పంపిణీ రసాభాస**



**మహేశ్వరం, జూలై 15 (ప్రజాస్వరం) :**

మహేశ్వరం నియోజకవర్గం, ఆర్కే పురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ రసాభాసగా జరిగింది. ప్రొటోకాల్ ఉల్లంఘించి ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడితో చెక్కులు పంపిణీ చేయించడంపై మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా రెడ్డి తీవ్ర ఆగ్రహం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి చేపట్టే ఏ కార్యక్రమమైనా పార్టీ పరంగా చేస్తాం.. ఓడిపోయిన వ్యక్తుల చేతనే కార్యక్రమాలను నిర్వహిస్తామని ఒక చట్టం తీసుకొస్తే తమకేమీ ఇబ్బంది లేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గెలిచిన వ్యక్తులు అంటే గౌరవం లేకుండా రాజకీయ ఎజెండాగానే పాలన నడిపిస్తున్నారని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రంలో అత్యాచారాలు, దోపిడీలు చేస్తుంటే ఈ ప్రభుత్వం కళ్లు మూసుకొని పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. నిరుద్యోగులంతా రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనపడటం లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులను గౌరవించే సంస్కృతిని ఈ ప్రభుత్వం మర్చిపోతుందని, స్పీకర్ ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## పనుల్లో జాప్యం జరగొద్దు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్, జూలై 15, (ప్రజాస్వరం) :**

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో కొనసాగుతున్న పనుల ప్రగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో జరుగుతున్న పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్?మల్లన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీ రాజ్?శాఖ అధికారులు పాల్గొన్నారు.

## లండన్‌లో ఘనంగా టాక్ బోనాల జాతర



తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యుకే నలుమూలల నుండి సుమారు 1000కి పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు.టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షురాలు శ్రీమతి శుష్మణ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన వేడుకలకు, వ్యాఖ్యాతగా ఉపాధ్యక్షులు సత్య మూర్తి చిలుముల వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హౌంస్లో నగర డిప్యూటీ మేయర్ ముహమ్మద్ షకీల్ అక్రమ్ పాల్గొన్నారు. లండన్‌లో స్వదేశంలో జరుపుకున్నట్టు సాంప్రదాయ బద్ధంగా బోనాల జాతర ప్రారంభానికి ముందు పూజలు నిర్వహించి, తొట్టెల ఊరేగింపు చేశారు. ఈ బోనాల జాతరలో పోతురాజుల ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లండన్‌కి ఉన్నత చదువులకోసం వచ్చిన ప్రవాస తెలంగాణ విద్యార్థి అక్షయ్ మల్చేలం వారి వంశ వృత్తిని మర్చిపోకుండా పోతురాజు వేషం ధరించి మన తెలంగాణ సంస్కృతి కోసం బోనాలు ఊరేగింపులో పాల్గొని వేడుకలకు సరికొత్త శోభను తీసుకొచ్చాడు. పోతురాజు విన్యాసాలను ప్రవాసులే కాక హాజరైన ముఖ్య అతిథులు సైతం ప్రసంశించారు. హౌంస్లో నగర డిప్యూటీ మేయర్ ముహమ్మద్ షకీల్ అక్రమ్ మాట్లాడుతూ.. యూకేలో నివసిస్తున్న తెలంగాణ ఎన్నారైలు అంతా సమాజ సేవలో ఎంతో క్రియాశీలకంగా పాల్గొంటారని, వీరి స్ఫూర్తి చాలా గొప్పదని తెలిపారు. విదేశాల్లో ఉన్నపటికీ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెబుతున్న తీరు చాలా గొప్పగా ఉందని, టాక్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు.

# రైతు సదస్సును జయప్రదం చేయండి

**సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు ముద్దమల్ల భార్గవ్**

**మంచిర్యాల,జూలై.15 (ప్రజాస్వరం) :**

ఈనెల 21న గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాల్లో జరగబోయే రైతు సదస్సును జయప్రదం చేయాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు ముద్దమల్ల భార్గవ్ పిలుపునిచ్చారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమతా సైనిక దళ్ రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి రైతు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముద్దమల్ల భార్గవ్ మాట్లాడుతూ..... ప్రజలందరికి పట్టెడు అన్నం పెట్టే రైతన్నలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించకుండా, గిట్టుబాటు ధర కల్పించకుండా కాలయాపన చేస్తూ రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారని ఆరోపించారు.. రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ రైతు సదస్సుకు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ కాసిం, భారత్ బచావో నాయకులు గాదె ఇన్నారెడ్డి, డాక్టర్ గోపీనాథన్, తిరుపతయ్య, ఐఎఫ్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్



అహ్మద్ లతో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. కనుక పెద్దపల్లి జిల్లాలోని రైతులు కార్మికులు కర్షకులు విద్యార్థులు ఉద్యోగులు మేధావులు బుద్ధి జీవులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్శల్ దుర్గం నగేష్, దుర్గా సిద్దార్థ రామ్మూర్తి, దుర్గం కుమార్, చంద్రగిరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షతో పాటు తులం బంగారం అన్న కాంగ్రెస్ హామీని నెరవేర్చాలి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



**నిజామాబాద్, జులై 15 (ప్రజాస్వరం) :**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చాలని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భీంగల్ మండల కేంద్రంలోని బంజారా భవన్ లో ఏర్పాటు చేసిన భీంగల్ మండలానికి చెందిన 136 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ చెక్ ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..మొన్నటి ఎన్నికల ప్రచారంలో పిసిసి అధ్యక్షులు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలవి కానీ హామీలు ఇచ్చారు అని ఎమ్మెల్యే అన్నారు.కేసీఆర్ ఉంటే ఈ నెల లక్ష...వచ్చే నెల మెమొస్తే లక్ష తో పాటు తులం బంగారం ఇస్తాం అని అన్నారు..ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తోంది..లక్ష తో పాటు తులం బంగారం హామీ నెరవేర్చాలని ఈ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు పేదింటి ఆడబిడ్డ పెళ్లి కి కష్టం కాకూడదు అని కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించి గత పది ఏండ్లుగా పెళ్ళైన ఆడబిడ్డకు ఆర్థిక సహాయం చేసారని..ఈ ప్రభుత్వం మొన్నటి ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన లక్ష కు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారు..ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు దాటింది.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం ఇచ్చిన కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ చెక్ లు పొందిన లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూలై 15 (ప్రజాస్వరం) :**

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సబావత్ మోతిలాల్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జిఎం సంజీవరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవరాశి మనుగడ,పర్యావరణ పరిరక్షణ,వాతావరణ సమత్యులతను కాపాడటం లలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తారని,భావితరాలకు కాలుష్యం లేని స్వచ్ఛమైన సహాయ వాయువు అందించాలని మొక్కలు నాటి సురక్షించడం ప్రతి ఒక్కరికి బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖకు 20 లక్షలు,సింగరేణి సంస్థ 7 లక్షలు,అటవీ శాఖకు 9 లక్షలు,మున్సిపాలిటీలకు 7.50 లక్షలు,ఇతర శాఖలకు 1 లక్ష మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని,ఆయా శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని తెలిపారు.ఇండ్లలో సైతం మొక్కలు నాటి సురక్షించలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్నూర్ చౌరస్తాకు..డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలి



**మంచిర్యాల/లక్షెట్టిపేట, జూలై 15 (ప్రజాస్వరం) :**

పట్టణంలో ఉత్నూర్ లో గల చౌరస్తాకు రాజ్యాంగ రచయిత,భారత రత్న,డా. బాబా సాహెబ్ అంబేద్కర్ చౌక్ గా పేరు పెట్టాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు అన్నారు.సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రజలంతా నిత్యం అంబేద్కర్ చౌక్ గా పిలుచుకుంటున్న చౌరస్తాకు అంబేద్కర్ పేరు పెడితే బాగుంటుందన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుల పేర్లు పెట్టడం అంటే వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడమే నన్నారు. మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించడం చాలా మంచి శుభ పరిణామమన్నారు.వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం నల్మాస్ కాంతయ్య మున్సిపల్ చైర్మన్ వచ్చే మున్సిపల్ సమావేశాల్లో భారతరత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడానికి మున్సిపల్ సామావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.బాబా సాహెబ్ భారత ప్రజలందరికి దైవ సామానుడని,అయన బాటలోనే తాము ప్రజా సేవ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దమ్మ నారాయణ,మాలెం చిన్నన్న, మండల ప్రధాన కార్యదర్శి భైరం రవి,మండల ఉపాధ్యక్షుడు భైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, అలుగునూరి నరేష్, చాతరాజు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో యువ నైపుణ్య దినోత్సవం"



**నిజామాబాద్, జులై 15 (ప్రజాస్వరం) :**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాతపురం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పడగల్ గ్రామంలో గ్రామంలో ప్రపంచ "యువ నైపుణ్య దినోత్సవం" సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. సుమారు వందమంది విద్యార్థుల్ను రెండు గ్రూపులుగా పాల్గొనడం జరిగింది. ఈరోజుల్లో కేలం చదువు మీదే కాకుండా అదనంగా నైపుణ్యం సంపాదించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్ ప్రధానోపాధ్యాయులు రామ్ చందర్ చెప్పారు. ఈ పోటీలలో రెండు విభాగం గాలుగా ప్రథమ ద్వితీయ తృతీయుమతులుగా నగదు బహుమతి, సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేయడం జరిగింది .పి జలంధర్ సార్ వ్యాఖ్యతగా వ్యవహరించి కార్యక్రమాన్ని నడిపించారు ఈ కార్యక్రమంలో కోశాధికారి నారాయణ గౌడ్, ప్రాజెక్ట్ చైర్మన్ అంబాల తిరుపతి, కో ప్రాజెక్ట్ చైర్మన్ చావ్లా మిగతా ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

# ఢిల్లీలో తెలంగాణ సంబరాలు










**న్యూఢిల్లీ, జూలై 15 (ప్రజాస్వరం) :**
ప్రతి సంవత్సరం ఆనవాయితీగా శ్రీ సింహవాణి మహంకాళి టెంపుల్ లాల్ దర్వాజా వారు ఈ సంబరాలను జరుపుతూ వస్తున్ననారు ఈ కార్యక్రమంలో తెలంగాణ నుండి శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ అకాడమీ వారి కళాకారులు పలు సాంస్కృతి కార్యక్రమాల్లోవారి కళాకారులు పలు సంస్కృతి కార్యక్రమా లను ప్రదర్శించారు ఈ అకాడమీ ఫౌండర్ మరియు డైరెక్టర్ అయిన గణేష్ మాస్టర్ గారు మరియు అసిస్టెంట్ మాస్టర్ లక్ష్మణ్ వారి విద్యార్థి విద్యార్థులచే నిర్వహించిన కళారూపాలు ప్రేక్షకులను మరిమరిపించాయి క్లాసికల్ డాన్సు ముఖ్యంగా క్లాసికల్ ప్లే డాన్స్ చిన్నారి విష్ణువర్ధని ప్లేట్ డాన్స్ తో ప్రేక్షకులను ఎంతగానో అలరించింది ఈ కార్యక్రమంలో చిన్నారులు సాయివర్ష దీక్షిత అక్షయ భార్గవి శ్రీలత ఉత్ప్రేక్ష నిత్య శ్రీ ఈ విద్యార్థులు వారి నృత్యాలతో అలరించారు.

# ఆ మంత్రి పదవిపై ఆశలు

**విజయవాడ, జూలై 15 (ప్రజాస్వరం) :**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏది చేసినా దానికో లెక్క ఉంటుంది డిప్యూటీ సీఎం పవన్ సినీ డైలాగ్ నాకో లెక్కుంటుంది గుర్తు చేసేలా చంద్రబాబు యాక్షన్ ఎప్పుడూ సస్పెన్స్‌గానే ఉంటుంది. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సీఎం చంద్రబాబు తొలిసారే 24 మందిని తన క్యాబినెట్‌లోకి చేర్చుకున్నారు.సంఖ్యాపరంగా ఏపీ క్యాబినెట్‌లో 25 మందిని చేర్చుకోవచ్చు. కానీ, చంద్రబాబు వ్యూహాత్మకంగా ఒక్క ఖాళీని వదిలేశారు. ఇలా ఆ ఒక్కటి ఎందుకు భర్తీ చేయలేదని మంత్రివర్గం కొలువుదీరిన నుంచి ఇప్పటివరకు తెలుగు తమ్ముళ్లు చెవులు గొణుక్కుంటున్నారు. ఇక మంత్రి పదవులు రాని లీడర్లు అయితే తమ కోసమే ఆ ఖాళీ ఉంచేశారని ఆశతో కాలం గడిపేస్తున్నారు. కానీ, బాబు వ్యూహం ఏంటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.క్యాబినెట్‌లో ఒక్క ఖాళీ వదిలేయడంతో ఇటు టీడీపీ అటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నుంచి ఆశావహులు మంత్రి పదవిపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఆశావహుల లెక్క చెప్పమంటే వన్ ఈస్ హండ్రెడ్ అబౌ అన్నటుగా వంద మందికి పైనే మంత్రి పదవి కోసం కలలు కంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలతోపాటు కొందరు ఎమ్మెల్సీలు.. ఎమ్మెల్సీ హామీతో ఎన్నికల్లో గట్టిగా పనిచేసిన సీనియర్లు ఉన్నారు. దీంతో చంద్రబాబు క్యాబినెట్ బెర్తను ఎప్పుడు పూర్తిస్తారా? అని అంతా ఎదురుచూసేలా ఆ ఒక్క ఖాళీ ఊరిస్తోంది.చంద్రబాబు రాజకీయ చాణక్యుడు. ఆయన రాజకీయం ఎవరికీ ఒక పట్టాన అర్థం కాదు. ఆయన అన్ని మంత్రి పదవులూ ఇచ్చేసి మరీ ఒక్క బెర్త్‌ని అలా ఉంచడం దేనికి సంకేతం మంటూ మరికొంతమంది నేతలు చర్చించుకుంటున్నారు. అసలు ఎవరి కోసం ఆ ఒక్క బెర్త్‌ను పెండింగ్‌లో ఉంచారనేది ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.ప్రస్తుతం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి 164 మంది సభ్యుల బలం ఉంది. ఇందులో 24 మంది ఇప్పటికే మంత్రులుగా ఉన్నారు. మరికొందరికి ప్రభుత్వ చీఫ్‌విప్, విప్ పదవులు కట్టబెట్టనున్నారు. ఐతే ఖాళీగా ఉన్న ఒక్క మంత్రి పదవిపై పలువురు సీనియర్లు కన్నేశారు. సీఎంపై ఒత్తిడి పెంచేందుకు రకరకాల మార్గాల ద్వారా ప్రయత్నిస్తున్నారు.అటు శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం వరకు చాలా మంది మంత్రి పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రస్తుతం మంత్రి అచ్చెన్నాయుడు ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఆ జిల్లా నుంచి కాళింగ సామాజిక వర్గానికి చెందిన కూన రవికుమార్ కూడా బెర్త్ ఆశిస్తున్నారు. అదేవిధంగా విజయనగరం నుంచి కళావెంకటరావు, విశాఖ నుంచి గంటా శ్రీనివాసరావు మంత్రి చాన్స్ రాకపోదా? అనే ఆశతోనే కాలం గడుపుతున్నారు.

**ఉభయ గోదావరి జిల్లాల నుంచి?**

ఇక ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇప్పటికే ఎక్కువ మందికి ప్రాధాన్యం కల్పించగా, సీనియర్ నేత రఘురామకృష్ణంరాజు, చింతమనేని ప్రభాకర్ తమ వంత ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కృష్ణా గుంటూరు జిల్లాల నుంచి దేవినేని ఉమా, మండలి బుద్ధప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజా కూడా గుర్తింపు కోసం తహతహలాడుతున్నారు.ఉమా, రాజా పొత్తుల్లో తమ సీట్లను త్యాగం చేశారు. వీరికి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఈ ఇద్దరూ మంత్రి పదవి కోసం ఎదురుచూస్తున్నారు. ఇక నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాయలసీమ ప్రాంతానికి చెందిన కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, కోట్ల జయప్రకాశ్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి వంటివారూ అవకాశం ఇవ్వకపోతారా? అన్నట్లే ఎదురుచూస్తున్నారు.ఇదే సమయంలో బీజేపీ, జనసేన కూడా మరో మంత్రి పదవిని ఆశిస్తున్నాయి. ఇంతమందిని ఆశగా ఎదురుచూసేలా చేసిన ఆ ఒక్క ఖాళీ.. సిట్టింగ్ మంత్రులను సైతం భయపెడుతోందట%ౌ% ప్రస్తుతం క్యాబినెట్‌లో ఉన్న మంత్రుల ఫెర్ఫార్మెన్స్ సరిగా లేకపోతే విస్తరణలో ఊస్టేంగేనని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు సీఎం చంద్రబాబు. దీంతో ఆ ఒక్కఖాళీ ఉండటం వల్ల ఎప్పుడైనా విస్తరణ జరిగే అవకాశం ఉందని%ౌ% దీంతో తమ పదవి మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతుందేమోనని మంత్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. మొత్తానికి సీఎం చంద్రబాబు వ్యూహాత్మకంగా ఉంచిన ఒక్క ఖాళీ అందరినీ అటెన్షన్‌లో పెడుతోందంటున్నారు.

## టీటీడీ సేవల్లో పారదర్శకత

**తిరుమల, జూలై 15 (ప్రజాస్వరం) :**

శ్రీవారి దర్శనంతో పాటు వసతి సేవల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు టీటీడీ సిద్ధమైంది. దళారుల ప్రమేయం లేకుండా, మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది.భక్తులకు ఆఫ్‌లైన్ (కౌంటర్ సేవలు) మరియు ఆన్‌లైన్ (వెబ్ పోర్టల్) రెండింటిలోనూ అందించే సేవలను అనేక మంది మధ్యవర్తులు భక్తులను మోసం చేసి, భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు టీటీడీ గుర్తించింది. గత ఏడాది కాలంగా ఆన్‌లైన్ లో (రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శనం, డిప్, వసతి, ఆర్జిత సేవలు, వర్చువల్ సేవలు మొదలైనవి) మరియు ఆఫ్‌లైన్ లో (ఎస్ ఎస్ డి టోకెన్లు, వసతి) తదితర సేవల బుకింగ్‌లపై ఇటీవల టీటీడీ విచారణ జరిపింది. ఇందులో ఒకే మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలు ఉపయోగించి మధ్యవర్తులు బల్క్ బుకింగ్ పొందినట్లు విచారణలో తేలింది.ఈ ఏడాది తిరుమలలో కరెంట్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌తో 110 గదులు, 124 బుకింగ్స్ సంబంధించి 12కు పైగా గదులు పొందినట్లు అధికారుల విచారణలో నిర్ధారణ అయింది. అదేవిధంగా ఆన్‌లైన్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌ను ఉపయోగించి 807 వసతి బుకింగ్‌లు, ఒకే ఇమెయిల్ ఐడిని ఉపయోగించి 926 వసతి బుకింగ్‌లు చేసినట్లు తేలిందని.ఒకే మొబైల్ నంబర్‌ని ఉపయోగించి ఒక సంవత్సరంలో 1,279 డిప్ రిజిస్ట్రేషన్‌లు, ఒకే మెయిల్ ఐడిని ఉపయోగించి ఒక సంవత్సరంలో 48 డిప్ రిజిస్ట్రేషన్‌లు, ఒకే ఐడి ప్రూఫ్ ఉపయోగించి 14 ఎస్ ఎస్ డి సర్వ సర్వదర్శనం టోకెన్‌లు పొందినట్లు టీటీడీ విచారణలో గుర్తించారు.విచారణలో కీలక అంశాలు వెలుగు చూడటంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అందిస్తున్న సేవలలో పారదర్శకతను మరింతగా పెంచేందుకు సిద్ధమైంది. ఈ సేవలను మరింత మెరుగుపరిచి ఆఫ్‌లైన్‌లో మరియు ఆన్‌లైన్‌లో టికెట్లు పొందే దళారులు మరియు మధ్యవర్తులపై చర్యలు చేపట్టింది.ఇందులో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్‌లు, మెయిల్ మరియు ఐడి ప్రూఫ్‌లను టీటీడీ రద్దు చేసింది. ఫేక్ మొబైల్ నెంబర్లు, మెయిల్ ఐడీలు, ఐడి ప్రూఫ్ ల ఉపయోగించి ఇప్పటికే బుక్ చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతించబడవు. బుకింగ్ రద్దు అయినట్లు రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు తెలియజేయబడుతుంది.నిజమైన యాత్రికులు 'ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్'ను ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టీటీడీ కార్యాచరణ రూపొందిస్తుంది. దళారులు ఫేక్ మొబైల్, మెయిల్, ఐడి ప్రూఫ్‌లను ఉపయోగించి చేసిన బుకింగ్‌లపై కఠినమైన ఆంక్షలు విధించారు. సరైన ధృవీకరణ కోసం ఆధార్ సేవలను ఉపయోగించేలా కూడా ప్రయత్నాలు చేపడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపింది.

## జీపీఎస్‌పై ఉద్యోగుల ఆగ్రహం

**విజయవాడ, జూలై 15 (ప్రజాస్వరం) :**

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు ఊహించని షాక్ తగిలింది. జీపీఎస్ అమలుకు తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన గ్యారెంటీ పెన్షన్ సిస్టమ్ (జీపీఎస్) అమలపై రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే దీనిపఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సీపీఎస్, జీపీఎస్‌ను సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చేస్తామని టీడీపీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న చంద్రబాబు, అధికార బాధ్యలు చేపట్టిన నెలకే గెజిట్ విడుదల చేయడమేంటనీ ప్రశ్నిస్తున్నాయి.


**2023 అక్టోబర్ 20 నుంచే అమలులోకి..**

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ గ్యారెంటీ పెన్షన్ సిస్టమ్ (ఏపీజీపీఎస్)లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 అక్టోబర్ 20 నుంచే జీపీఎస్ అమలులోకి వస్తుందని గెజిట్‌లో పేర్కొంది. జీపీఎస్ చట్టం-2023లోని చాప్టర్ 1లోని సెక్షన్ 1, సబ్ సెక్షన్ (3) ప్రకారం ఈ గెజిట్ విడుదల చేసినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ పేరు మీదుగా గెజిట్ విడుదల అయింది.జీపీఎస్‌కి సంబంధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికార బాధ్యతలు తీసుకున్న జూన్ 12నే జీవో నెంబర్ 54ను విడుదల చేశారు. అయితే ఈ జీవోను బయటికి రాలేదు. శుక్రవారం విడుదల చేసిన గెజిట్‌లో జూన్ 12వ తేదీనే జీవో నెంబర్ 54 విడుదల చేశామని పేర్కొన్నారు.2019 ఎన్నికల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేస్తానని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కానీ సీపీఎస్‌ను రద్దు చేయలేదు. దీంతో సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటానికి సిద్ధమయ్యాయి. 2022 ఫిబ్రవరి 3న విజయవాడలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కదం తొక్కారు. భారీగా హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయలతో విజయవాడలో ప్రభంజనం సృష్టించారు. దీంతో దిగొచ్చిన ఏపి ప్రభుత్వం సీపీఎస్‌పై కమిటీ వేసేందుకు సిద్ధపడింది. ఈ క్రమంలోనే ఉద్యోగులు, ఉపాధ్యాయల మధ్య విభజనకు కూడా ప్రభుత్వం పూనుకుంది. దీంతో ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయలు కన్నెర్ర చేశారు.ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆందోళనకు దిగొచ్చిన ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న కమిటీ వేసింది. ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బొత్స సత్యనారాయణ, ఆదితమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపింది. అనంతరం ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు సూచిస్తూ నివేదిక ఇచ్చింది. దానికనుగుణంగా సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చింది. దీన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి.అయితే ఇటీవలే జరిగిన (2024 మే 13న) ఎన్నికల మ్యానిఫెస్టోలో టీడీపీ అధినేతగా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు హామీ ఇచ్చారు. ప్రజాగళం పేరుతో విడుదల చేసిన టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి మ్యానిఫెస్టోలో కూడా సీపీఎస్, జీపీఎస్‌పై పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి పునఃసమీక్ష చేయలేదు. ఇదే సమయంలో జీపీఎస్ అమలుపై అధికార బాధ్యతలు చేపట్టిన రోజే (జూన్ 12న) జీవో నెంబర్ 54 తీసుకొచ్చారు. సరిగ్గా నెల రోజుల తరువాత శుక్రవారం రాత్రి (జులై 12న) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మండిపడుతున్నాయి. అయితే ఈ గెజిట్ పై ప్రభుత్వంలోని పెద్దలు స్పందించాల్సి ఉంది%ౌ!

**రద్దు చేయాల్సిందేః యూటీఎఫ్ నేతలు డిమాండ్..**

జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ దుర్మార్గమని, దీన్ని వెంటనే రద్దు చేయాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఇదొక దుర్మార్గమైన చర్యఅని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించడమే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని తెలిపారు.

## మరో సారి గద్దెనెక్కనున్న కేపీ శర్మ ఓలి!..



నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి మరోసారి గద్దెనెక్కనున్నారు. ప్రస్తుత ప్రధాని పుష్ప కమల్ దహాల్ అలియాస్ ప్రచండ విశ్వాస పరీక్షలో ఓడిపోవడంతో నేపాల్ ప్రధాని పీఠం కేపీ శర్మ ఓలిని వరించింది. ఓలిని ప్రధానిగా పొత్తు పక్షాలు అంగీకరించాయి. దీంతో ఓలిని కొత్త ప్రధానిగా నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ నియమించారు. రేపు ప్రధానిగా కేపీ శర్మ ఓలి మరో సారి ప్రమాణస్వీకారం చేయనున్నారు. నేపాల్ లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఒప్పందం ప్రకారం ప్రధానిగా ఉన్న ప్రచండ అధికార బదలాయింపుకు అంగీకరించకపోవడంతో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్- యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ తమ మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో ప్రచండ విశ్వాస తీర్మాణాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. శుక్రవారం జరిగిన విశ్వాస పరీక్షలో ప్రచండకు మద్దతుగా కేవలం 63 ఓట్లు మాత్రమే రావడంతో ఆయన ఓడిపోయారు. దీంతో నేపాల్ లో కొత్త ప్రభుత్వానికి శ్రీకారం చుట్టారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్.. నేపాల్ కాంగ్రెస్ తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. సభలో అతి పెద్ద పార్టీగా ఉన్న నేపాల్ కాంగ్రెస్ తో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని సీపీఎన్- యూఎంఎల్ పార్టీ వారం కిందట ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ప్రచండకు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందం అనంతరం నేపాలీ కాంగ్రెస్ చీఫ్ షేర్ బహదూర్ దేవ్‌బా, ఓలిని తదుపరి ప్రధానిగా ఆమోదిస్తున్నట్లు తెలిపారు. వీరి మధ్య ఒప్పందం ప్రకారం 18 నెలలు ఓలి, అనంతరం మిగిలిన కాలం దేవ్‌బా ప్రధాని పదవి చేపట్టనున్నారు. కాగా 275 మంది సభ్యులున్న నేపాలీ పార్లమెంట్ లో నేపాలీ కాంగ్రెస్ కు 89 సీట్లు ఉండగా.. సీపీఎస్-యూఎంఎల్ కి 78 సీట్ల బలం ఉంది. ఇరు పార్టీలు కలవడంతో ఆ సంఖ్య మెజారిటీ అవసరమైన 138 సీట్లు కంటే ఎక్కువగా ఉంది.

## కుప్పంలో వైసీపీ ఖాళీ...



**తిరుపతి, జూలై 15 (ప్రజాస్వరం) :**

కుప్పం.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డా..! 1989 నుంచి చంద్రబాబును తిరుగులేని నాయకుడిగా నిలబెట్టిన నియోజకవర్గం. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు గెలిచినా, ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కుప్పంలో పట్టు కోసం ప్రయత్నం చేసింది. సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డింది. ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లాలో చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హవా నడిచింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు భారీ మెజారిటీకి గండి కొట్టిన వైసీపీ చంద్రబాబు విజయాన్ని మాత్రం నిలువరించ లేకపోయింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీ పట్టు సాధించింది. కుప్పం మున్సిపాలిటీ తోపాటు అన్ని మండలాలపై పట్టు నిలుపుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రదర్శించాలని భావించిన వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. చంద్రబాబుకు గట్టి పోటీని ఇచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేసింది. ఎన్నో ప్రలోభాలకు ప్రయత్నించింది. అయితే లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యంగా క్యాంపెయిన్ చేసిన టీడీపీ కేడర్ కుప్పంలో వరుసగా చంద్రబాబుకు ఎనిమిదో విజయాన్ని అందించింది. దాదాపు 50 వేల మెజారిటీ తో కుప్పం చంద్రబాబును నాలుగో సారి సీఎంను చేసింది. దీంతో ఒక్కసారిగా కుప్పంలో పొలిటికల్ సీన్ రివర్స్ అయింది.గత 5 ఏళ్లలో కుప్పంలో టీడీపీని ఇరుకునపెట్టేందుకు ప్రయత్నం చేసిన వైసీపీని ముప్పుతిప్పలు పెట్టేందుకు టీడీపీ శ్రేణులకు ఛాన్స్ దొరికింది. రివర్స్ గేమ్ ఆడేందుకు టీడీపీ కేడర్ కూడా సన్నద్ధం అయ్యింది. ఈ నేపథ్యంలోనే కుప్పంలో టిడిపి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తుంది. అయితే ఇప్పటికే వైసీపీ ముఖ్య నేతలు, సానుభూతిపరులు నెల రోజులుగా కుప్పంకు దూరంగానే ఉండటంతో రివెంజ్ పాలిటిక్స్‌కు ఇంకా పూర్తిగా తెర తీయని పరిస్థితి నెలకొంది. వైసీపీ ఓడిపోయిన తరువాత కుప్పం ముఖం చూడాలంటేనే భయపడే పరిస్థితి ఆ పార్టీ నేతలకు ఎదురైంది. కుప్పంకు రాకుండా దూరం నుంచే పరిస్థితిని అంచనా వేసుకుంటున్న వైసీపీ నేతలు సేఫ్ జోన్ లో ఉండాలని భావిస్తున్నారు. టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.ముఖ్యంగా కుప్పం మున్సిపాలిటీలోని వైసీపీ కౌన్సిలర్లు గంప గుత్తుగా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు టీడీపీ హై కమాండ్ ను కలిసేందుకు ఆ పార్టీ గేటు ముందు వెయిట్ చేస్తున్నారు.

కుప్పం మునిసిపాలిటీ లో 25 వార్డులు ఉండగా ఆరుగురు టీడీపీ కౌన్సిలర్లు ఉండగా, 19 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉన్నారు. కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ తోపాటు 11 మంది కౌన్సిలర్లు పసుపు కండువా కలుపుకునేందుకు హై కమాండ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ, గ్రీన్ సిగ్నల్ లేకపోవడంతో వెయిటింగ్ లో ఉన్నారు. మరికొద్ది మంది టీడీపీలో చేరేందుకు అవకాశం వస్తే చాలు అనుకున్నట్లు సైకిల్ పై సవారీకి సిద్ధమైయ్యారు.తెలుగుదేశం పార్టీ హై కమాండ్ వలసలకు తలుపులు తీస్తే పార్టీ పిర్యాయింపులకు సిద్ధంగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లు, పార్టీ నేతలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. అయితే గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు, దాడులు, కేసులకు గురైన టీడీపీ నేతలు వైసీపీ లీడర్స్ ఎంట్రీకి బ్రేకులు వేస్తున్నారు. అధికారంలో ఉండగా కుప్పంలో టీడీపీ శ్రేణులను అన్ని విధాలా ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలను ఎట్టి పరిస్థితుల్లోనూ చేర్చుకోవద్దని హుకుం జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే టీడీపీ వైపు చూస్తున్న కుప్పం మునిసిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ ఆసుపత్రిపై దాడి చేసి రాకను ముందుగానే అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వైసీపీ నేతలకు టీడీపీలో ఎంట్రీకి ఛాన్స్ లేదన్న సంకేతాన్ని ఇచ్చారు.ఇక కుప్పంలో వైసీపీ నే కనిపించకుండా చేయాలంటే ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు నేతలకు గాలం వేసి తీరాల్సిందేనన్న ఆలోచన కూడా ఆ పార్టీలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అదే జరిగితే ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు క్యూ కట్టే వైసీపీ నేతల సంఖ్యతో ఆ పార్టీ కుప్పంలో ఖాళీ అవుతుందన్న చర్చ నడుస్తోంది. ఇదే జరిగితే కుప్పంలో రివర్స్ గేమ్ తో వైసీపీ ఇరుకన పడక తప్పదేమో అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

## టీడీపీ, వైసీపీ మధ్య మాటలయుద్ధం



**విశాఖపట్టణం, జూలై 15 (ప్రజాస్వరం) :**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ మధ్య మాటలయుద్ధం సాగుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో తమ హయాంలో అభివృద్ధి సాధించిందని తెలుగుదేశం చెబుతుంటే ఉత్తారాంధ్రకు టీడీపీ చేసిందేమీ లేదని వైసీపీ ఆరోపిస్తోంది. తాజాగా ఆ ప్రాంతంలో చంద్రబాబు పర్యటించటం.. కూటమికి అద్భుతవిజయం కట్టబెట్టిన మూడు జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో వైసీపీ నేతలు ఉలిక్కిపడుతున్నారు. గత ఎన్నికల్లో తాను గెలిస్తే.. విశాఖను రాజధానిగా చేయటంతో పాటు అక్కడ నుంచే పాలన చేస్తామన్న జగన్.. ఆ ప్రాంతానికి చేసిందేమీ లేదనేది జనం మాట. రాజధాని అంటూ ప్రకటన చేశారు తప్ప.. అక్కడ అభివృద్ధి ఏదనేది టీడీపీ ఆరోపణ. కాబట్టి ఉత్తరాంధ్రపైనే ఇరుపార్టీల నేతల మధ్య వాగ్వాదం సాగుతోంది.సీఎం హోదాలో తొలిజిల్లా పర్యటనను ఉత్తరాంధ్రలో సీఎం చంద్రబాబు పెట్టుకున్నారు.ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా ప్రతి ఎకరానికీ నీరిస్తామని హామీ ఇచ్చారు. అనకాపల్లికి తాగు, సాగు నీరిస్తే తన జన్మ ధన్యం అవుతుందన్నారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలనే సంకల్పంతోనే పని చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసే పనులు ఏ విధంగా జరుగుతున్నాయో.. ప్రజలంతా గమనించాలన్నారు. దీంతో పాటు సీఐఐ సదస్సు, మెడ్‌కో ప్రతినిధులతోనూ భేటీ అయ్యి అభివృద్ధి అంశాలు, పెట్టుబడులపై సీఎం చర్చించారు.ఉత్తరాంధ్రపై చంద్రబాబు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్. జగన్‌ను విమర్శించడంపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టాలని సూచించారు. తాము ఉత్తరాంధ్ర కోసం చాలా చేశామని.. టీడీపీ నేతలు మాటలు మాని.. అభివృద్ధి చేసి చూపించాలని అన్నారు.వైసీపీ నేతలపై విమర్శలు మాని.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని మాజీమంత్రి పేర్ని నాని అన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను మర్చిపోయారని.. మళ్లీ అభివృద్ధి అంటూ జనంలోకి వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా పనులు చేసి చూపించాలంటూ సవాల్ చేశారు పేర్నినాని.మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్‌లు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలపై కౌంటరిచ్చారు బుద్దా వెంకన్న. కూటమి సర్కారు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని.. చెప్పినవన్నీ పూర్తి చేస్తామంటూ కౌంటర్ ఇచ్చారు. ఇచ్చిన హామీలను జగన్ నెరవేర్చలేదు కాబట్టే.. వైసీపీని జనం తిరస్కరించారని.. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తు పెట్టుకోవాలని సూచించారు.మొత్తానికి ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న వైసీపీ నేతలు.. టీడీపీపై విమర్శలు చేయటం ద్వారా ఉనికి చాటుకునే యత్నాలు చేస్తున్నారని రాజకీయవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

## విశాఖ వైసీపీ విలవిల.. ఎక్కడా కనిపించని వైసీపీ నేతలు

**విశాఖపట్టణం, జూలై 15 (ప్రజాస్వరం) :**

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ నేతలు పూర్తి సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. అధికారంలో ఉండగా రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పిన జిల్లా నేతలు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. దాదాపు నెల రోజులుగా చాలా మంది లీడర్లు బయటకే రావడం లేదు. తమ ఓటమికి కారణాలేంటనే కనీస సమీక్ష కూడా చేయడం లేదు. ముఖ్యంగా పార్టీ అధికారంలో ఉండగా, మంత్రి పదవులను అనుభవించిన వారు ఎక్కడా కనిపించకపోవడం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారుతోంది.విశాఖ జిల్లాలో వైసీపీకి ఎందరో నాయకులు ఉన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉండగా, విశాఖను పరిపాలన రాజధాని చేస్తామని ఎంతో హడావిడి చేసింది. స్థానిక నేతలకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ పెద్దపీట వేసింది. మాడుగుల మాజీ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు, భీమిలి మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్‌లకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించింది వైసీపీ.ఐతే ఈ ముగ్గురూ ఈ ఎన్నికల్లో ఓడినా.. అమర్‌నాథ్ తప్ప, మిగిలిన ఇద్దరూ ఆచూకీ లేకుండా పోయారని క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రుషికొండ ప్యాలెస్‌పై తెగ హడావుడి చేస్తే%ౌ% అమర్‌నాథ్ తప్ప ఏ ఒక్క వైసీపీ నేత కూడా పల్లెత్తు మాటాడలేదు. దీంతో వైసీపీ ఆత్మరక్షణలో పడిపోవాల్సివచ్చింది. పార్టీ అధికారంలో ఉండగా అధికారం అనుభవించిన నేతలు%ౌ% ఓటమి తర్వాత సైలెంట్ అవడాన్ని కార్యకర్తలు ఆక్షేపిస్తున్నారు.రాష్ట్రంలో జిల్లాలకు జిల్లాల్లోనే వైసీపీ తుడిచిపెట్టుకుపోగా, విశాఖ జిల్లా మాత్రం ఆ పార్టీకి గౌరవం దక్కేలా రెండు ఎమ్మెల్యే, ఓ ఎంపీ సీటులో గెలిపించారు ఓటర్లు. ఇక ఓ రాజ్యసభ ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్సీలు కూడా వైసీపీ తరఫున ఉన్నారు. అంటే రాష్ట్రంలో మరే జిల్లాలోనూ లేనంత సంఖ్యలో ఆరుగురు ప్రజాప్రతినిధులు ఉమ్మడి విశాఖ నుంచి వైసీపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.కానీ, వీరెవరూ ఎన్నికల ఫలితాల తర్వాత కనిపించలేదు. విశాఖ, అనకాపల్లిలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయాలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తప్ప, మిగిలిన నేతలు అంతా పార్టీ గప్‌చుప్ అన్నట్లే వ్యవహరిస్తున్నారు.జిల్లాలో వైసీపీకి బలమైన నేతలు ఉన్నారని ఇన్నాళ్లు క్యాడర్ మురిసిపోయేవారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తి రాజు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ గతంలో దూకుడుగా వ్యవహరించి%ౌ% ఆయా నియోజకవర్గాల్లో సర్వం తామే అన్నట్లు చక్రం తిప్పేవారు. ఐతే పార్టీ ఓడిపోయాక వీరెవరూ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్‌తోపాటు జిల్లా పరిషత్‌లోనూ వైసీపీయే అధికారంలో ఉంది. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత ఈ పదవుల్లో ఉన్న నేతలు సైతం పార్టీపరమైన పనులకు దూరంగానే ఉంటున్నారు.ఇలా మొత్తం ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ ముఖ్య నేతలు పత్తాలేకుండా పోవడంపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసిన నేతల కోసం తామెంతో త్యాగాలు చేసి.. క్షేత్రస్థాయిలో పోరాడితే.. ఇప్పుడెవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఇదే అదునుగా అధికార పక్షం టార్గెట్ చేస్తుండటంతో చాలా మంది దిగువ స్థాయి నేతలు బటయకు రావడానికి కూడా భయపడుతున్నారు. కష్టకాలంలో అండదండగా నిలవాల్సిన నేతలే తప్పించుకు తిరిగితే తమ పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు. మొత్తానికి నేతల అజ్ఞాత వాసంతో విశాఖ వైసీపీ విలవిల్లాడిపోతోంది.





# నాలుగేళ్ల నాటి డ్యాన్స్ కట్‌పై ట్రోల్సా ?

హైదరాబాద్: తన డ్యాన్స్‌ను ట్రోల్ చేస్తూ సోషల్‌మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌పై నటి అనసూయ స్పందించారు. పారదర్శక, గౌరవప్రదమైన విమర్శలను తాను ఆహ్వానిస్తానని చెప్పారు. 'నా మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకొని కొన్ని విషయాలపై స్పందించకూడదని నిర్ణయించుకున్నా. మహానటి సావిత్రమ్మకు నివాళిగా దాదాపు నాలుగేళ్లక్రితం ఓ ఈవెంట్‌లో నేనిచ్చిన ప్రదర్శనలోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌ను ట్రోల్ చేయడం.. వాటికి ఇలా అవమానకర రీతిలో విమర్శలు చేయడం బాధాకరం. ఇక్కడ నా గురించి చెప్పట్లేదు.. నివాళులకు సంబంధించిన విషయాల్లో ఇలా చేయడం ఆ గొప్ప వ్యక్తులను అవమానపర్చినట్లే..! మర్యాదపూర్వకమైన విమర్శలను నేను ఎప్పుడూ స్వాగతిస్తా. ఆ కార్యక్రమంలో నా మొత్తం ప్రదర్శన చూసిన తర్వాత మీరు ఒక నిర్ణయానికి రండి' అని ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. అనసూయ ప్రస్తుతం వరుస సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. 'పుష్ప 2'తోపాటు 'ఫ్లాష్‌బ్యాక్', 'వోల్ఫ్' వంటి తమిళ చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# వచ్చే నెలలోనే కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ వివాహం

నటుడు కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ వివాహానికి ముహూర్తం ఖరారైంది. వచ్చే నెలలో వీరి పెళ్లి జరగనుంది. తనకు కాబోయే భర్త కిరణ్ అబ్బవరం పుట్టినరోజును పురస్కరించుకుని రహస్య ఈ విషయాన్ని బయటపెట్టారు. ఆయనకు బర్త్‌డే విషెస్ చెబుతూ ఇన్‌స్టాలో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 'రాజావారు రాణిగారు' సమయం నుంచి నిశ్చితార్థమైన నాటివరకూ వీరిద్దరూ కలిసి దిగిన పలు ఫొటోలు, వీడియోలతో స్పెషల్ వీడియో క్రియేట్ చేసి దాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'హ్యాపీ బర్త్‌డే కిరణ్ అబ్బవరం. మరో 38 రోజుల్లో నిన్ను.. మై హస్బెండ్ అనేందుకు ఆశగా ఎదురుచూస్తున్నా' అని ఆమె క్యాప్షన్ జత చేశారు. 2019లో విడుదలైన 'రాజావారు రాణిగారు'తోనే కిరణ్ తెరంగేట్రం చేశారు. ఇందులో రహస్య కథానాయికగా నటించారు. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరించింది. ఆ మూవీ షూటింగ్‌లోనే ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం.. ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. మార్చిలో వీరి నిశ్చితార్థం జరిగింది. కిరణ్ ప్రస్తుతం 'క' కోసం వర్క్ చేస్తున్నారు. పాన్ ఇండియా ఫిల్మ్‌గా ఇది విడుదల కానుంది. సుజీత్, సందీప్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని 'క' టీజర్ విడుదల చేశారు.

# కన్నడ నటుడు, నిర్మాత రక్షిత్‌శెట్టిపై కేసు



కన్నడ నటుడు, నిర్మాత రక్షిత్‌శెట్టి పై కేసు నమోదైంది. తమ సంస్థకు చెందిన పాటలు కాపీ కొట్టారని పేర్కొంటూ ఎంఆర్‌టీ మ్యూజిక్ కంపెనీ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'న్యాయ ఎల్లిదే', 'గాలిమాతు' చిత్రాల్లోని పాటలను రక్షిత్, ఆయనకు చెందిన నిర్మాణసంస్థ పరంవా స్టూడియోస్ 'బ్యాచిలర్ పార్టీ'లో కాపీ కొట్టారని తెలియజేసింది. తమ పర్మిషన్ తీసుకోకుండా ఇలా చేయడం ఏమాత్రం సరికాదని పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ విషయంపై స్పందించమని కోరుతూ రక్షిత్‌కు నోటీసులు జారీ చేశారు. దిగంత్, అచ్యుత్‌కుమార్, యోగేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్యాచిలర్ పార్టీ'. పరంవా స్టూడియోస్ పతాకంపై రక్షిత్ శెట్టి నిర్మించారు. జనవరిలో విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ప్రస్తుతం ఇది అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులో ఉంది. ఆయా పాటలకు సంబంధించిన హక్కుల విషయమై గతంలో ఎంఆర్‌టీ స్టూడియోస్, రక్షిత్ శెట్టి సమావేశమైనప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని సమాచారం.

# వైవిధ్యంగా తంగలాన్ మూవీ చిత్రీకరణ

కథానాయకుడు చియాన్ విక్రమ్ ఎంపిక చేసుకునే పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. ప్రస్తుతం తంగలాన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కాలా, కబాలి వంటి సినిమాలు రూపొందించిన దర్శకుడు పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం తంగలాన్. ఈ చిత్రాన్ని పా.రంజిత్ తనదైన శైలిలో అందరూ అబ్బుర పడేలా చిత్రీకరించారని యూనిట్ వర్గాలు చెప్పారు. ఇక విడుదలైన ఈ థియేట్రికల్ ట్రైలర్ చూస్తుంటే తప్పకుండా ఈ చిత్రాన్ని థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమాలా అనిపిస్తుందని అంటున్నారు విక్రమ్ అభిమానులు. తంగలాన్ బంగారు నిధుల నేపథ్యంలో యథార్థ సంఘటనలతో తీసిన చిత్రంలా కనిసిస్తుంది. విజువల్స్ ఆకట్టుకునే విధంగా వున్నాయి. మేకింగ్‌లో రిచ్‌నెస్, ప్రొడక్షన్ క్వాలిటీస్ కనిపిస్తున్నాయి. విక్రమ్ ఈ చిత్రంలో అటవి జాతికి చెందిన వీరుడిలాగా? ఇప్పటి వరకు కెరీర్‌లో పోషించనటువంటి వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈ పాత్ర కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, కొన్నివారాల పాటు విక్రమ్ ఉపవాసాలు వున్నాడని తెలిసింది. ఈ పాత్ర కోసం విక్రమ్ చాలా హార్డ్ వర్క్ చేశారని తెలుస్తుంది. ఆయన చాలా బరువు తగ్గారు. ఇక ఈ ట్రైలర్ లో ఆ అటవీ ప్రాంతంలో బంగారు నిధులు ఉన్నాయని బ్రిటీషర్లు గుర్తించి అక్కడి గిరిజన తెగ ప్రజలను సహాయం కోరుతారు. ఈ క్రమంలో నిధుల తవ్వకం మొదలు పెడుతారు. అప్పుడు అక్కడి ప్రజలు ఎదురుకునే ప్రమాదాల నుండి ప్రాణాలకు తెగించి కాపాడే పాత్రలో విక్రమ్ కనిపించనున్నాడు. తమ జాతి ప్రజలను కాపాడుకునే వీరుడిగా విక్రమ్ నటన మరో లెవల్‌లో వుంటుందని అంటున్నాయి చిత్ర వర్గాలు.. మాళవిక మోహనన్,పార్వతీలు డీ గ్లామర్ రోల్ లో నటిస్తున్నారు. తంగలాన్ ఆగష్టు 15 న విడుదల కానున్నట్లు సమాచారం.






# భారతీయుడు-2 నెగెటివ్ టాక్

## ప్రారంభ వసూళ్లు వీక్

దాదాపు 28 సంవత్సరాల క్రితం శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారతీయుడు సినిమా ఎంతటి ఘన విజయం సాధించందో తెలిసిన విషయమే. దానికి సీక్వెల్ భారతీయుడు 2.ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అయితే ఫస్ట్ షో నుంచే ఈ సినిమాకు నెగెటివ్ టాక్ రావడం మొదటి భాగమైన భారతీయుడికి ధీటుగా లేకపోవడం వలన మూవీపై చాలా దెబ్బ పడింది. ఇక ఎన్నో అంచనాలతో చిత్రాన్ని వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులకు అడుగడుగునా అసంతృప్తికి గురిచేసిందని సినిమా రివ్యూలు చెబుతున్నాయి. దీనికి తోడు టిక్కెట్ల రేట్లు పెంచడం ఈ చిత్రానికి మైనస్ అనే చెప్పకోవాలి. తెలంగాణలో టిక్కెట్ల రేట్లు పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వంను అనుమతి కోరగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే మల్టిప్లె క్స్‌లలో 75 నుంచి 150 వరకు టిక్కెట్ల రేటు పెంచడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ చిత్రానికి ఉన్న వీక్ టాక్ తో ప్రారంభ వసూళ్లు కూడా లేకపోవడం గమనార్హం. ఇటీవల విడుదలై బ్లాక్ బస్టర్ గా నిలిచిన కల్కి 2898 ఏడీ సినిమాకు కూడా టిక్కెట్ల రేట్ల పెంపుదల కాస్త మైనస్ గానే మారిందని అందరి అభిప్రాయం. భారతీయుడు-2 కూడా టిక్కెట్ల రేట్లు పెంచడం, సినిమా ప్రేక్షకులను నిరాశపరిచిన విధానం వీటి ప్రభావం కలెక్షన్స్ పై పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో భారతీయుడు -2 కలెక్షన్స్ కష్టమే అంటున్నారు.

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154